RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్

ప్రజల గొంతుక - నిజం కోసం..

ఆఫ్ ప్రజలు



ప్రభుత్వంతో చర్చలు సఫలం..

## ఆటో, క్యాబ్ సమ్మె విరమణ

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | సోమవారం, ఆగస్టు 24, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 116 | పేజీలు: 8 | వెల : రూ.1

# మరో ఎంపీకి అమాత్య యోగం.. తెలంగాణ నుంచి ఎవరికి అవకాశం?

హైదరాబాద్, ఆగస్టు 23 (వాయిస్ టుడే): కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై జరుగుతున్న ప్రచారం తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. రాష్ట్రం నుంచి మరో బీజేపీ ఎంపీకి కేంద్ర మంత్రి పదవి దక్కే అవకాశం ఉందన్న ఊహాగానాలు రాజకీయ వర్గాల్లో జోరుగా వినిపిస్తున్నాయి. ఇటీవల బీజేపీ కేంద్ర కమిటీ విస్తరణలో తెలంగాణకు ఆశించిన స్థాయిలో ప్రాధాన్యం దక్కకపోవడం, రాష్ట్రానికి చెందిన ఇద్దరు కీలక నేతలను జాతీయ కార్యవర్గం నుంచి తప్పించడంతో ఈ ప్రచారానికి మరింత ఊతం లభించిందని రాజకీయ విశ్లేషణలు సాగుతున్నాయి.



### ఇప్పటికే ఇద్దరు కేంద్ర మంత్రులు

తెలంగాణలో బీజేపీకి ప్రస్తుతం ఎనిమిది మంది లోక్‌సభ ఎంపీలు ఉన్నారు. వీరిలో ఇప్పటికే ఇద్దరు కేంద్ర మంత్రులుగా కొనసాగుతున్నారు. కేంద్ర మంత్రివర్గ విస్తరణ జరిగితే తెలంగాణకు మరో అవకాశం కల్పించాలనే ఆలోచన అధిష్టానం స్థాయిలో ఉందన్న ప్రచారం తెరపైకి వచ్చింది. మరోవైపు, తెలంగాణలో రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కీలక నేతలకు కొత్త బాధ్యతలు, పదవులు అప్పగించే అవకాశం ఉందన్న చర్చ కూడా జరుగుతోంది.

### అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా వ్యూహాలు

మరో రెండేళ్లలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీని బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టాలని పార్టీ అగ్రనాయకత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. కేవలం ప్రధాన ప్రతిపక్ష స్థానంతో సరిపెట్టుకోకుండా అధికారాన్ని సాధించే స్థాయిలో పార్టీని విస్తరించేందుకు రాష్ట్ర నాయకత్వాన్ని మరింత క్రియాశీలం చేయాలనే వ్యూహంలో భాగంగానే కీలక నేతలకు ప్రాధాన్యం కల్పించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

### ఎనిమిది మందిలో ఎవరికి?

ఇప్పటికే ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉండటంతో మిగిలిన ఆరుగురు లోక్‌సభ ఎంపీల్లో ఒకరికి అవకాశం దక్కుతుందా? లేక తెలంగాణకు చెందినప్పటికీ ఇతర రాష్ట్రాల నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న నేతలకు కేంద్ర మంత్రివర్గంలో చోటు కల్పిస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది. తెలంగాణకు చెందిన ఇద్దరు బీజేపీ నేతలు ప్రస్తుతం ఇతర రాష్ట్రాల నుంచి రాజ్యసభ సభ్యులుగా కొనసాగుతున్నారు. మాజీ బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కె. లక్ష్మణ్ ఉత్తరప్రదేశ్ నుంచి, బీసీ ఉద్యమ నాయకుడు ఆర్. కృష్ణయ్య ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

### బీసీ, మహిళా సమీకరణాలపై చర్చ

కేంద్ర మంత్రివర్గంలో సామాజిక, ప్రాంతీయ సమీకరణాలకు ప్రాధాన్యం ఇస్తే తెలంగాణ నుంచి బీసీ లేదా మహిళా కోటాలో ఒకరికి అవకాశం కల్పించే అంశం పరిశీలనలో ఉండొచ్చన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే

(మిగతా 2వ పేజీలో)




# లండన్‌లో తెలుగు ప్రవాసులతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

లండన్, ఆగస్టు 24 (వాయిస్ టుడే): తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి లండన్‌లోని తెలుగు ప్రవాసులతో సమావేశమయ్యారు. పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి సోమవారం ఉదయం తెలుగు డయాస్పోరాతో ఆయన ముచ్చటించారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధిలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రవాసులు భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. లి'తెలంగాణ రైజింగ్'లికు బలమైన మద్దతుదారులు, అంబాసిడర్లుగా నిలవాలని కోరారు. తెలంగాణను ప్రపంచస్థాయి ఆర్థిక, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయాణంలో ప్రవాస తెలంగాణవాసులు, తెలుగు సమాజం చురుకుగా భాగస్వామ్యం కావాలని సీఎం ఆకాంక్షించారు. ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన తెలుగు సమాజంతో తెలంగాణకు ఉన్న అనుబంధం రాష్ట్రానికి ఎంతో బలమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్‌ను ప్రపంచానికి తీసుకెళ్లడంతో పాటు, ప్రపంచాన్ని తెలంగాణకు మరింత చేరువ చేసేందుకు కలిసి పనిచేయాలని ఆయన అన్నారు. తెలంగాణ అభివృద్ధి, పెట్టుబడులు, సాంకేతికత, ఆవిష్కరణల రంగాల్లో ప్రవాసుల సహకారం కీలకమని సీఎం వివరించారు. లండన్‌లోని తెలుగు సమాజంతో జరిగిన ఈ సమావేశం తెలంగాణతో ప్రవాసుల అనుబంధాన్ని మరింత బలోపేతం చేసే దిశగా సాగింది.



వాయిస్ ఆఫ్ ప్రజలు

సోమవారం, ఆగస్టు 24, 2026

# ఏపీ లిక్కర్ రవాణా స్కాం: మాజీ మంత్రి కారుమూరి అరెస్ట్

**ఏపీ మద్యం రవాణా కుంభకోణంలో మాజీ మంత్రి కారుమూరి అరెస్ట్**

**హైదరాబాద్ కొండాపూర్‌లో అదుపులోకి తీసుకున్న ఈడీ అధికారులు**

**ఇప్పటికే కారుమూరి కుమారుడితో సహా ముగ్గురిని అరెస్ట్ చేసిన దర్యాప్తు సంస్థ**

**రూ.195 కోట్లకు పైగా ఖజానాకు నష్టం జరిగిందని ప్రధాన ఆరోపణ**

**ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడంతో తప్పని అరెస్ట్**

ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఆదివారం అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులు అరెస్ట్ కాగా, తాజాగా కారుమూరి అరెస్ట్‌తో దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. ఇటీవల కారుమూరి నాగేశ్వరరావు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. జూలై 29న ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం, ఈ స్కామ్ విలువ రూ.350 కోట్లకు పైగా ఉందని వ్యాఖ్యానిస్తూ, కస్టోడియల్ విచారణ అవసరమని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే ఈడీ అధికారులు కారుమూరిని అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది.



### ఏమిటీ మద్యం స్కామ్?

గత ప్రభుత్వ హయాంలో ఏపీలో మద్యం రవాణా టెండర్ల ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగాయన్నది ప్రధాన ఆరోపణ. టెండర్ నిబంధనలను ఉద్దేశపూర్వకంగా మార్చి, సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్, ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్ వంటి సంస్థలకు అనుకూలంగా వ్యవహరించారని ఈడీ తన దర్యాప్తులో గుర్తించింది. మార్కెట్ రేట్ల కన్నా ఎక్కువ ధరకు కాంట్రాక్టులు కట్టబెట్టడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.195.33 కోట్ల నష్టం వాటిల్లినట్లు ఏపీ సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ విచారణ కొనసాగిస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో రాజ్ కెసిరెడ్డి, అప్పటి ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి కీలకపాత్ర పోషించినట్లు ఈడీ ఆరోపిస్తోంది. ఈ సిండికేట్‌లో మాజీ మంత్రి కారుమూరి, ఆయన కుమారుడు సునీల్ కుమార్‌కు కూడా వాటా ఉందని, వారి కుటుంబానికి సుమారు రూ.10 కోట్లకు పైగా ముడుపులు అందినట్లు దర్యాప్తు సంస్థ అనుమానిస్తోంది. ఈ కేసులో భాగంగా జూన్ నెలలో ఈడీ విస్తృతంగా తనిఖీలు చేపట్టింది. మొదట రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిలను అరెస్ట్ చేసింది. అనంతరం కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్ కుమార్‌ను కూడా అదుపులోకి తీసుకుంది. ఇప్పుడు మాజీ మంత్రి కారుమూరిని కూడా అరెస్ట్ చేయడంతో ఈ కేసు దర్యాప్తు మరింత వేగవంతం కానుంది.

# ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై ఆందోళన.. రంగంలోకి 21 మంది మాజీ కెప్టెన్లు



పాకిస్థాన్ మాజీ ప్రధాని, ప్రపంచ కప్ విన్నింగ్ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఆయనకు మానవతా దృక్పథంతో మెరుగైన వైద్య సంరక్షణ అందించాలని కోరుతూ ప్రపంచవ్యాప్తంగా 21 మంది మాజీ క్రికెట్ కెప్టెన్లు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు లేఖ రాశారు. వీరిలో భారత క్రికెట్ దిగ్గజాలు సునీల్ గవాస్కర్, కపిల్ దేవ్, దిలీప్ వెంగ్‌సర్కార్ కూడా ఉండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది రాజకీయ జోక్యం కాదని, కేవలం క్రీడా స్ఫూర్తితోనే ఈ విజ్ఞప్తి చేస్తున్నామని వారు స్పష్టం చేశారు. గత మూడేళ్లకు పైగా జైలు శిక్ష అనుభవిస్తున్న 73 ఏళ్ల ఇమ్రాన్ ఖాన్‌కు ఆయన వ్యక్తిగత వైద్యులతో కూడిన బోర్డుతో వైద్య పరీక్షలు జరిపించాలని పాక్ సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశించింది. అయితే, ఆ ఆదేశాలు పూర్తిగా అమలు కాలేదని ఈ లేఖలో మాజీ కెప్టెన్లు ఆరోపించారు. కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా, కేవలం కొన్ని గంటల పాటే ఆసుపత్రిలో ఉంచి ప్రభుత్వ వైద్యులతో పరీక్షలు జరిపి, 'ఆరోగ్యంగానే ఉన్నారు' అని చెప్పి తిరిగి జైలుకు పంపించారని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇమ్రాన్ కుడి కంటి చూపు మందగించిందని వస్తున్న వార్తలపై వారు ఆందోళన వ్యక్తం చేశారు.

# మరో ఎంపీకి అమాత్య యోగం.. తెలంగాణ నుంచి ఎవరికి అవకాశం?

బీసీ వర్గానికి చెందిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కేంద్ర మంత్రిగా ఉన్న నేపథ్యంలో మహిళా ప్రాతినిధ్యం దిశగా డీకే అరుణ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. డీకే అరుణను బీజేపీ జాతీయ ఉపాధ్యక్ష పదవి నుంచి తప్పించడంపై కూడా రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. భవిష్యత్తులో ఆమెకు కేంద్ర మంత్రివర్గంలో అవకాశం కల్పించే వ్యూహంలో భాగంగానే ఈ మార్పు జరిగిందా? అనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

### డీకే అరుణకు అనుకూలంగా సీనియార్టీ

డీకే అరుణకు సీనియార్టీ, సుదీర్ఘ రాజకీయ అనుభవం, తెలంగాణ రాజకీయాలపై ఉన్న అవగాహన అనుకూల అంశాలుగా భావిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాజకీయంగా దీటుగా నిలబడగల నాయకురాలిగా ఆమెకు ఉన్న గుర్తింపు కూడా మంత్రి పదవి రేసులో అదనపు బలంగా రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత ప్రాంతానికి చెందిన నాయకురాలిగా డీకే అరుణకు ఉన్న రాజకీయ అనుభవాన్ని రాష్ట్రంలో పార్టీ విస్తరణకు ఉపయోగించుకోవచ్చన్న అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి.

### లక్ష్మణ్ పేరు కూడా ప్రముఖంగానే..

మరోవైపు డీకే అరుణకు పోటీగా బీసీ నేత కె. లక్ష్మణ్ పేరు కూడా బలంగా వినిపిస్తోంది. బీజేపీలో సుదీర్ఘకాలంగా పనిచేసిన అనుభవం, పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో పట్టుతో పాటు సంఘ్ పరివార్ నేపథ్యం ఆయనకు అదనపు బలంగా రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ నుంచి కేంద్ర మంత్రి పదవికి డీకే అరుణ, కె. లక్ష్మణ్ పేర్లు ప్రధానంగా చర్చలో ఉన్నప్పటికీ.. కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై అధికారిక నిర్ణయం వెలువడే వరకు ఎవరికి అవకాశం దక్కుతుందనేది స్పష్టతకు రాదని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# చేదెక్కిన చక్కెర.. ధరల నియంత్రణకు కేంద్రం కీలక చర్యలు



ముంబై, ఆగస్టు 23 (వాయిస్ టుడే): దేశంలో చక్కెర ధరలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రానున్న పండుగ సీజన్‌లో వినియోగదారులకు చక్కెర కొరత లేకుండా చూడటంతో పాటు ధరలను నియంత్రించేందుకు పలు కీలక చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం.. జూలై 20న కిలో చక్కెర ధర రూ.48.18 ఉండగా, ఆగస్టు 20 నాటికి రూ.55.70కి పెరిగింది. మార్కెట్ పరిస్థితులను ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ, అనవసర ధరల పెరుగుదల, నిల్వలు, కృత్రిమ కొరతను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటోంది.

### 10 లక్షల టన్నుల చక్కెర దిగుమతికి అనుమతి

పండుగ సీజన్‌లో దేశీయ మార్కెట్‌లో తగినంత సరఫరా ఉండేలా 10 లక్షల టన్నుల చక్కెర దిగుమతికి కేంద్రం అనుమతించింది. చక్కెర వ్యాపారుల వద్ద నిల్వలను నియంత్రించేందుకు ఒక్కో వ్యాపారికి 400 టన్నుల స్టాక్ లిమిట్‌ను కూడా విధించింది. అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించనుంది.

### ఇథనాల్‌పై నింద సరికాదు

చక్కెర ధరల పెరుగుదలకు ఇథనాల్ ఉత్పత్తిని కారణంగా చూపడం సరికాదని కేంద్రం స్పష్టం చేసింది. ఇథనాల్ తయారీకి మళ్లించే చక్కెర వాటా 2022-23లో సుమారు 12 శాతం ఉండగా, 2025-26 నాటికి దాదాపు 9 శాతానికి తగ్గుతుందని ప్రభుత్వం తెలిపింది. అంతేకాకుండా దేశంలో ఉత్పత్తి అవుతున్న ఇథనాల్‌లో దాదాపు మూడొంతులకుపైగా ఇప్పుడు ధాన్యాల నుంచి, ముఖ్యంగా మొక్కజొన్న నుంచి ఉత్పత్తి అవుతోందని పేర్కొంది.

### తగ్గిన చక్కెర ఉత్పత్తి

ప్రస్తుత సీజన్‌లో దేశీయ చక్కెర ఉత్పత్తి అంచనాల కంటే తగ్గే అవకాశం ఉంది. తొలుత సుమారు 343 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి ఉంటుందని అంచనా వేయగా, ప్రస్తుతం అది దాదాపు 306 లక్షల మెట్రిక్ టన్నులకు పరిమితం కావచ్చని ప్రభుత్వం అంచనా వేసింది. చెరకు పంటను రెడ్ రాట్, టాప్ బోరర్ వంటి తెగుళ్లు దెబ్బతీయడంతో పాటు అధిక వర్షాలు, పొలాల్లో నీటి నిల్వలు కూడా దిగుబడిపై ప్రభావం చూపినట్లు కేంద్రం తెలిపింది. అయితే అక్టోబర్‌లో కొత్త క్రషింగ్ సీజన్ ప్రారంభమయ్యే వరకు దేశీయ అవసరాలను తీర్చేందుకు సరిపడా చక్కెర నిల్వలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

### ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ధరలు

చక్కెర ధరల పెరుగుదల భారత్‌కు మాత్రమే పరిమితం కాలేదని కేంద్రం తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా సరఫరా కొరత, ప్రతికూల వాతావరణ పరిస్థితులు అంతర్జాతీయ మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి. 2026-27 సంవత్సరానికి ప్రపంచవ్యాప్తంగా సుమారు 33 లక్షల మెట్రిక్ టన్నుల చక్కెర కొరత ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. దీంతో అంతర్జాతీయ చక్కెర ధరలు జూన్ 30న టన్నుకు 474 డాలర్ల నుంచి ఆగస్టు 20 నాటికి 552 డాలర్లకు చేరాయి. అంటే రెండు నెలల లోపే 16 శాతానికి పైగా పెరుగుదల నమోదైంది.

### రైతులకు 97 శాతం చెరకు బకాయిల చెల్లింపు

ఇథనాల్ కార్యక్రమం రైతులకు, చక్కెర మిల్లులకు ప్రయోజనం చేకూర్చిందని ప్రభుత్వం పేర్కొంది. 2026 ఆగస్టు 20 నాటికి 2025-26 చక్కెర సీజన్‌కు సంబంధించిన చెరకు బకాయిల్లో 97 శాతం ఇప్పటికే రైతులకు చెల్లించినట్లు తెలిపింది. చక్కెర మిల్లుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో ప్రభుత్వ సబ్సిడీలపై వాటి ఆధారపడటం కూడా తగ్గిందని కేంద్రం వెల్లడించింది. 2014 నుంచి 2021 మధ్య చక్కెర పరిశ్రమకు సుమారు రూ.14,600 కోట్ల సబ్సిడీ అందించగా, 2021-22 నుంచి ఇలాంటి సబ్సిడీని ప్రభుత్వం ప్రకటించలేదని పేర్కొంది.

### సరఫరా పెంపుపై దృష్టి

భారత్ సాధారణంగా ఏడాదికి 320-340 లక్షల మెట్రిక్ టన్నుల చక్కెరను ఉత్పత్తి చేస్తుంది. దేశీయ వినియోగం సుమారు 280-290 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంటుంది. ఉత్పత్తి అధికంగా ఉన్నప్పుడు మిగులు చక్కెర నిల్వలు మిల్లుల నిధులను స్తంభింపజేసి రైతులకు చెరకు బకాయిల చెల్లింపులను ఆలస్యం చేసే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో అదనపు చక్కెరను ఇథనాల్ ఉత్పత్తి వైపు మళ్లించడం ద్వారా చక్కెర మిల్లుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచే ప్రయత్నం జరుగుతోందని కేంద్రం వివరించింది. వినియోగదారులపై ధరల భారం ఎక్కువ కాకుండా, రానున్న పండుగ సీజన్‌లో నిరంతర సరఫరా ఉండేలా దిగుమతులు, స్టాక్ పరిమితులు, మార్కెట్ పర్యవేక్షణ వంటి చర్యలను కేంద్రం కొనసాగిస్తోంది.

# ప్రభుత్వంతో చర్చలు సఫలం.. తెలంగాణలో ఆటో, క్యాబ్ సమ్మె విరమణ

**తెలంగాణలో ఈ అర్ధరాత్రి నుంచి జరగాల్సిన ఆటో, క్యాబ్ సమ్మె విరమణ**

**ప్రభుత్వంతో కార్మిక సంఘాల చర్చలు విజయవంతం**

**డిమాండ్లపై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూల హామీ**

**సమ్మెను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించిన ఐక్య కార్యాచరణ కమిటీ**

**ప్రయాణికులకు తప్పిన రవాణా కష్టాలు**

తెలంగాణలో ఈ అర్ధరాత్రి నుంచి తలపెట్టిన ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్ల నిరవధిక సమ్మె విరమించుకున్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ జరిపిన చర్చలు ఫలించడంతో యూనియన్లు ఈ నిర్ణయం తీసుకున్నాయి. దీంతో రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా హైదరాబాద్ నగరవాసులు ఊపిరి పీల్చుకున్నారు. ఆగస్టు 23 అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆటోలు, క్యాబ్‌లు, స్కూల్ వ్యాన్‌లు నిలిపివేయాలని 'కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ' పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం వెంటనే స్పందించి యూనియన్ల నేతలను చర్చలకు ఆహ్వానించింది. మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన యూనియన్ల డిమాండ్ల పట్ల సానుకూలంగా స్పందించారు. ప్రధానంగా ఆర్టీసీ ద్వారా ఈవీ ఆటోలను ప్రవేశపెట్టాలన్న ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా ఒక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ డిమాండ్లపై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించి, వాటి పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ఆయన అంగీకారం తెలిపినట్టు సమాచారం. ప్రభుత్వ హామీతో సంతృప్తి చెందిన యూనియన్ల నేతలు, సమ్మెను విరమించుకుంటున్నట్లు అధికారికంగా ప్రకటించారు. మంత్రితో చర్చలు సఫలం కావడంతో, యథావిధిగా ఆటోలు, క్యాబ్‌లు, ఇతర ప్రైవేట్ వాహనాలు రోడ్డెక్కనున్నాయి. దీంతో ప్రయాణికులకు రవాణా కష్టాలు తప్పినట్టయింది.

# బంగ్లాదేశ్‌లో దారుణం.. రిటైర్డ్ హిందూ టీచర్ కుటుంబం హత్య

**ఇద్దరు పిల్లలతో సహా నలుగురిని హతమార్చిన దుండగులు**

**డ్రగ్స్ తీసుకుంటుండగా అడ్డుకున్నందుకే ఈ ఘాతుకం**

**ఘటనకు సంబంధించి ఇద్దరు యువకులను అరెస్ట్ చేసిన పోలీసులు**

బంగ్లాదేశ్‌లో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. రంగ్‌పూర్ నగరంలో నివసిస్తున్న ఓ రిటైర్డ్ హిందూ టీచర్ కుటుంబాన్ని దుండగులు కిరాతకంగా హత్య చేశారు. డ్రగ్స్ తీసుకుంటున్న యువకులను అడ్డుకున్నందుకు వారు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే, రంగ్‌పూర్ నగరంలోని దాస్‌పారా ప్రాంతంలో రిటైర్డ్ టీచర్ గణపతి చక్రవర్తి (65) తన కుటుంబంతో నివసిస్తున్నారు. ఆయన భార్య ప్రీతిలత (50), కుమార్తె అగామి చక్రవర్తి (23), కుమారుడు ప్రియం చక్రవర్తి (12) ఉన్నారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం, గురువారం రాత్రి ఇద్దరు యువకులు డ్రగ్స్ తీసుకునేందుకు పక్క భవనం మీదుగా గణపతి ఇంటి పైకప్పుపైకి వచ్చారు. శబ్దం విని మేడపైకి వెళ్లిన గణపతి వారిని ప్రశ్నించడంతో గొడవ మొదలైంది. ఈ క్రమంలో నిందితులు ఓ తువ్వాలుతో ఆయన గొంతు నులిమి చంపేశారు. ఆ తర్వాత పైకి వచ్చిన గణపతి భార్య ప్రీతిలతను కూడా ఓ వస్త్రంతో గొంతు బిగించి హత్య చేశారు. అనంతరం కిందకు వెళ్లి వారి కుమార్తె, కుమారుడిని కూడా దారుణంగా హతమార్చారు. గురువారం నుంచి కుటుంబ సభ్యుల ఫోన్లు స్విచాఫ్ రావడంతో అనుమానం వచ్చిన బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం రాత్రి 11:30 గంటల సమయంలో పోలీసులు ఇంటి తాళాలు పగలగొట్టి చూడగా ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. గణపతి మృతదేహం ఇంటి పైకప్పుపైనా, భార్య, కుమార్తె మృతదేహాలు మెట్లపైనా, కుమారుడి మృతదేహం మంచం కింద పడి ఉన్నాయి. గణపతి చక్రవర్తి స్థానిక జిల్లా స్కూల్‌లో టీచర్‌గా పనిచేసి గతేడాది డిసెంబర్‌లో రిటైర్ అయ్యారు. ఆయన కుమార్తె ఇంగ్లీషులో మాస్టర్స్ పూర్తి చేయగా, కుమారుడు 5వ తరగతి చదువుతున్నాడు. గణపతికి ఎవరితోనూ శత్రుత్వం లేదని, ఆయన చాలా మంచివారని బంధువులు చెబుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, ముగ్ధో, సిద్ధార్థ అనే ఇద్దరు బంధువులను అరెస్టు చేసి విచారిస్తున్నారు.

# సత్తెనపల్లిలో విషాదం.. లిఫ్ట్‌లో ఇరుక్కుని బాలిక మృతి

పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలో విషాదం చోటుచేసుకుంది. ఆడుకోవడానికి పక్కింటికి వెళ్లిన ఓ బాలిక లిఫ్ట్‌లో ఇరుక్కుని ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన కొత్తపేట కాలనీలో జరిగింది. అయితే, ఇది కేవలం ప్రమాదం కాదని, తమ కుమార్తె మృతిపై అనుమానాలున్నాయని తల్లిదండ్రులు ఆరోపించడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. కొత్తపేటకు చెందిన రేవతి (12) ఆదివారం సాయంత్రం పక్కింట్లో తన స్నేహితులతో ఆడుకోవడానికి వెళ్లింది. అపార్ట్‌మెంట్‌లోని లిఫ్ట్ వద్ద ఆడుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు అందులో ఇరుక్కుపోయింది. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో పడి ఉన్న రేవతిని చూసిన స్థానికులు వెంటనే స్పందించినా, అప్పటికే బాలిక మృతి చెందింది. ఆడుకోవడానికి వెళ్లిన తమ కుమార్తె నిమిషాల వ్యవధిలోనే విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనపై మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేస్తూ, తమ కుమార్తె మృతిపై అనుమానాలు వ్యక్తం చేశారు. కేవలం ప్రమాదవశాత్తు ఇలా జరగలేదని, దీని వెనుక వేరే కారణాలు ఉండవచ్చని ఆమె ఆరోపించారు. దీంతో ఈ ఘటనకు కొత్త కోణం తోడైంది. ఆ ఇంట్లో లిఫ్ట్ ను కొన్నిరోజుల కిందటే ఏర్పాటు చేశారు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు రంగప్రవేశం చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, అనుమానాస్పద మృతి (సెక్షన్ 174 సీఆర్పీసీ) కింద కేసు నమోదు చేశారు. అపార్ట్‌మెంట్‌లోని సీసీటీవీ ఫుటేజీని స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. ప్రమాదం జరిగిన తీరుపై స్థానికులను, రేవతితో పాటు ఆడుకుంటున్న ఇతర పిల్లలను విచారిస్తున్నారు. ఇది కేవలం లిఫ్ట్ వైఫల్యం వల్ల జరిగిన ప్రమాదమా లేక దీని వెనుక మరేదైనా కుట్ర కోణం ఉందా అనే దిశగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

# తెలంగాణ ఎమ్మెల్సీ బరిలో జనసేన.. గడల శ్రీనివాస్ పేరును ప్రకటించిన పార్టీ

**ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జనసేన అభ్యర్థి ఖరారు**

**మాజీ ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ గడల శ్రీనివాస్‌ను బరిలోకి దింపిన జనసేన**

**తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన పోటీ చేయడం ఇదే తొలిసారి**

**సెప్టెంబర్ 13న ఖమ్మంలో 'జనసేన-శంఖారావం' సభ నిర్వహణకు సన్నాహాలు**

తెలంగాణ రాజకీయాల్లో జనసేన పార్టీ కీలక అడుగు వేసింది. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి తమ అభ్యర్థిని అధికారికంగా ప్రకటించింది. తెలంగాణ ప్రభుత్వ మాజీ ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ గడల శ్రీనివాసరావును తమ అభ్యర్థిగా బరిలోకి దింపుతున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ ఆదివారం ఖమ్మంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ విషయాన్ని ప్రకటించారు. ప్రస్తుతం జనసేన తెలంగాణ అధికార ప్రతినిధిగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా సమన్వయకర్తగా పనిచేస్తున్న గడల శ్రీనివాసరావు అభ్యర్థిత్వానికి పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆమోదం తెలిపినట్లు తాళ్లూరి రామ్ స్పష్టం చేశారు. తెలంగాణలో ఒక శాసనమండలి స్థానానికి జనసేన అభ్యర్థిని నిలబెట్టడం ఇదే ప్రప్రథమం కావడం గమనార్హం. 2027 మార్చి తర్వాత ఈ ఎన్నిక జరగనుండగా, ఇతర ప్రధాన పార్టీలు అభ్యర్థులను ప్రకటించకముందే జనసేన వ్యూహాత్మకంగా ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ, పట్టభద్రులు, ఉద్యోగులు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై శాసనమండలిలో గళం వినిపిస్తానని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో తన గెలుపుపై ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల కార్యాచరణపై చర్చించేందుకు సెప్టెంబర్ 13న ఖమ్మంలో 'జనసేన-శంఖారావం' పేరుతో భారీ సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ గౌడ్ తెలిపారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పోటీ చేసేందుకు జనసేన సిద్ధమవుతున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ పరిణామం తెలంగాణలో పార్టీ విస్తరణకు తొలిమెట్టుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



# పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా గడల శ్రీనివాస్

## జనసేన నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు

హైదరాబాద్, ఆగస్టు 24 (వాయిస్ టుడే): రాబోయే ఖమ్మం--నల్గొండ--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థిగా తనను పరిగణించి ప్రకటించడం గొప్ప గౌరవంతో పాటు మరింత బాధ్యతను పెంచిందని జనసేన తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి గడల శ్రీనివాస్ తెలిపారు. తనపై విశ్వాసం ఉంచిన జనసేన పార్టీ అధినేత శ్రీ పవన్ కళ్యాణ్, పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ రామ్ తాళ్లూరి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ శ్రీ నేమూరి శంకర్ గౌడ్, పార్టీ నాయకత్వానికి గడల శ్రీనివాస్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

పట్టభద్రులు, యువత, నిరుద్యోగుల ఆశయాలకు బలమైన గొంతుకగా నిలుస్తానని ఆయన పేర్కొన్నారు. వారి సమస్యలను శాసనమండలి వేదికగా బలంగా వినిపించడంతో పాటు, వాటి పరిష్కారం కోసం అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తన ప్రధాన బాధ్యతగా భావిస్తున్నానని గడల శ్రీనివాస్ తెలిపారు. పట్టభద్రుల హక్కులు, యువత భవిష్యత్తు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. "మీ నమ్మకమే నా బలం.. ప్రజాసేవే నా లక్ష్యం. కలిసి నడుద్దాం.. విజయాన్ని సాధిద్దాం" అని గడల శ్రీనివాస్ పిలుపునిచ్చారు.





# భోనమెత్తిన బాచుపల్లి

## అమ్మవారి అనుగ్రహం ప్రజలందరిపై సంపూర్ణంగా ఉండాలి

## బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

కుత్బుల్లాపూర్ ఆగష్టు 23(వాయిస్ టుడే ): శ్రావణమాస భోనాలను పురస్కరించుకొని బాచుపల్లి, రాజీవ్ గాంధీ నగర్, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలలో నిర్వహించిన బోనాల వేడుకలకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై నల్ల పోచమ్మ, రేణుక ఎల్లమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని, నల్ల పోచమ్మ, రేణుక ఎల్లమ్మ తల్లుల దీవెనలు ప్రజలందరిపై సంపూర్ణంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కౌన్సిలర్ శంభీ పూర్ క్రిష్ణ, మాజీ కార్పొరేటర్లు కాసాని సుధాకర్, ఆగం రాజు, గాజుల సుజాత, మాజీ కో ఆప్షన్ సభ్యులు సలీం, చంద్రగిరి సతీష్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# రాజు రాథోడ్‌కు వరల్డ్ ఓపెన్ తైక్వాండో గ్రాండ్ ఛాంపియన్ షిప్

## పన్నెండు దేశాలు--ఇరవై రెండు రాష్ట్రాల మధ్య తెలంగాణకు గ్రాండ్ చాంపియన్‌షిప్

హైదరాబాద్, ఆగస్టు 23: హైదరాబాద్ లోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన తొలి ప్రపంచ ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్ --2026లో తెలంగాణకు చెందిన తైక్వాండో క్రీడాకారుడు, కోచ్ రాథోడ్ రాజు నాయక్ టోర్నమెంట్ గ్రాండ్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. పన్నెండు దేశాలు, ఇరవై రెండు రాష్ట్రాల నుంచి సుమారు రెండు వేల మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా తైక్వాండో సంఘం తరపున బరిలోకి దిగిన రాజు నాయక్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. పోరాట విభాగం, వేగవంతమైన పిడిగుద్దుల విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించడంతో పాటు ప్రపంచ రికార్డుల గ్రంథంలో తన పేరును నమోదు చేసుకున్నారు. కాచిగూడ లోని ఎంఎస్ఎస్ లా కళాశాలలో ఫైనల్ ఇయర్ లా చదువుతున్నాడు. ఈ సందర్భంగా ఆదివారం రాజు నాయక్ ను పలువురు అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా అమికల్ క్రీడా సమాఖ్య వ్యవస్థాపకురాలు వీణా వాహిని, జయరాం అంతర్జాతీయ యుద్ధకళల అకాడమీ గ్రాండ్ మాస్టర్ జయేంద్ర రెడ్డి రాజు నాయక్‌ను గ్రాండ్ చాంపియన్‌షిప్ అవార్డుతో సన్మానించి అభినందించారు. తెలంగాణ క్రీడా వర్గాలు ఆయన విజయంపై హర్షం వ్యక్తం చేశాయి.

# అంజయ్యనగర్‌లో భవనం కూలి ముగ్గురు మృతి

## అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోవాలి

## బీజేవైఎం నాయకుడు గుమ్మడి సాయి సుకుమార్ పటేల్



హైదరాబాద్, ఆగస్టు 24 (వాయిస్ టుడే): కొండాపూర్ డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్‌లో భవనం కూలి ముగ్గురు మృతి చెందిన ఘటనపై బీజేవైఎం కొండాపూర్ డివిజన్ అధ్యక్షులు గుమ్మడి సాయి సుకుమార్ పటేల్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను కేవలం భవనం కూలిన ప్రమాదంగా కాకుండా, నిర్మాణ అనుమతులు, నిబంధనల అమలు, నిర్మాణ నాణ్యతపై సమగ్ర విచారణ జరపాల్సిన అంశంగా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. అంజయ్యనగర్‌లో సుమారు 50 గజాల స్థలంలో ఆరు అంతస్తులు లేదా అంతకంటే ఎక్కువ అంతస్తులతో భవనం నిర్మించడం నిబంధనలకు అనుగుణంగా ఉందా? అని ఆయన ప్రశ్నించారు. ఇంత చిన్న స్థలంలో భారీ నిర్మాణం జరుగుతున్న సమయంలో సంబంధిత అధికారులు ఎందుకు గుర్తించలేకపోయారని నిలదీశారు. భవన నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? నిబంధనలు పాటించారా? నిర్మాణ నాణ్యతను అధికారులు పరిశీలించారా? అనే అంశాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు. నగరంలో ఇలాంటి నిర్మాణాలు ఇంకా ఉన్నాయని, మరో ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించే వరకు అధికారులు వేచి చూడకూడదని అన్నారు. ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు, గాయపడిన వారికి తక్షణమే తగిన నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిర్మాణ అనుమతులు, నాణ్యత ప్రమాణాల ఉల్లంఘనలకు బాధ్యులైన అధికారులపై, సంబంధిత వ్యక్తులపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సాయి సుకుమార్ పటేల్ కోరారు. అక్రమంగా నిర్మించిన అధిక అంతస్తుల భవనాలు, నాణ్యత లేని నిర్మాణాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం, హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. "మరో ప్రాణనష్టం జరగకముందే నగరంలోని అనుమానాస్పద, నిబంధనలకు విరుద్ధమైన నిర్మాణాలపై అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి" అని గుమ్మడి సాయి సుకుమార్ పటేల్ అన్నారు.



# 'ఆటో, క్యాబ్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాల్సింది ప్రభుత్వమే'

మేడ్చల్: ఆటో క్యాబ్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆటో, క్యాబ్ డ్రైవర్ల సంఘం ఐకాస నాయకులు.. మేడ్చల్ మండలం పూడూరు పరిధిలోని నివాసంలో ఎంపీ ఈటల రాజేందర్‌ను ఆదివారం కలిశారు. తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎంపీ దృష్టికి తెచ్చారు. ఈటల మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతోపాటు ఓలా, ఉబర్, రాపిడో తదితర సంస్థల కారణంగా ఆటో డ్రైవర్ల బతుకులు ఛిన్నాభిన్నమైనట్లు తెలిపారు. వారిని ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయన్నారు.

# గాజులరామారం డివిజన్‌లో రూ.99.50 లక్షలతో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ ఆగష్టు 23(వాయిస్ టుడే):కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో గాజులరామారం డివిజన్ పరిధిలో ఆదివారం సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. బాలాజీ లేఔట్‌లో రూ. 14 లక్షలు, వొక్షిత్ ఎంక్లేవ్‌లో రూ. 40.50 లక్షలు, వీనస్ ఎంక్లేవ్‌లో రూ. 45 లక్షల చొప్పున మొత్తం రూ. 99.50 లక్షల నిధులతో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. గాజులరామారం డివిజన్‌లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. ముఖ్యంగా కాలనీల్లో రహదారుల సమస్యలను పరిష్కరించేందుకు సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంలో సహకరించిన లిముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని తాను మంజూరు చేయించిన రోడ్ల పనులపై స్థానికంగా రాజకీయ ప్రచారం జరుగుతోందని



లికూన శ్రీశైలం గౌడ్ విమర్శించారు. తాను మంజూరు చేయించిన రోడ్లను ప్రస్తుత ఎమ్మెల్యే మంజూరు చేసినట్లుగా రోడ్ల వెంట తిరుగుతూ శంకుస్థాపనలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి పనులకు నిధులు లేవంటూ విమర్శలు చేస్తూనే, మరోవైపు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో చేపడుతున్న రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించడం ప్రజలను అయోమయానికి గురిచేసే విధంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

అభివృద్ధి పనుల విషయంలో రాజకీయాలకు అతీతంగా ప్రజల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గాజులరామారం డివిజన్‌లో రహదారులు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం అందుబాటులో ఉంటానని కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ మరియు కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు ఆంజనేయులు స్థానిక నాయకులు యాము సాగర్, లక్ష్మీ నారాయణరెడ్డి, కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు ప్రతినిధులు, అంజన్న, గోపాల్ రెడ్డి, వల్లెపు వేణు కుమార్, సురపరాజు, వెంకట్రావు, వెంకట్ రెడ్డి, శివ, కిరణ్, సురేష్ కుమార్, జగదీష్, నాగరాజు, కిరణ్, ఋషి కుమార్, శ్రీకాకుళం రవి, వెంకటేశ్వరరావు, అమ్రేష్, శశిధర్, దీపక్, సత్యనారాయణ, రామనాథరెడ్డి, రాఘవేంద్ర, రంగారెడ్డి, గోపి, ప్రతాపరెడ్డి, వివేక్, ఆనందరావు, మహేందర్, శ్రీపాల్ రెడ్డి మరియు స్థానికులు తదితరులు పాల్గొని సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శుభాకాంక్షలు తెలిపారు.



# దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత

## ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్ ఆగష్టు 23(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ భౌరంపేట్ లోని పెద్ద చెరువు కట్ట మైసమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ మరియు ఇందిరమ్మ కాలనీలోని నడిగడ్డ నాగులమ్మ ఎల్లమ్మ తల్లి బోనాల కార్యక్రమంలో పాల్గొన్న మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# కొంపల్లి డివిజన్ బిజెపి మోర్చా కమిటీల నియామకం

## ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.ఎస్. మల్లారెడ్డి

కుత్బుల్లాపూర్ ఆగష్టు 23(వాయిస్ టుడే ): భారతీయ జనతా పార్టీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి సూచన మేరకు, కొంపల్లి డివిజన్ అధ్యక్షుని బాధ్యతలో, రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.ఎస్.మల్లారెడ్డి ముఖ్య అతిథులుగా, మేడ్చల్ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు ఆదిరెడ్డి, రాజిరెడ్డి ఓబిసి మోర్చా అధ్యక్షులు శేఖర్ యాదవ్, కిసాన్ మోర్చా అధ్యక్షులు మల్లేష్ యాదవ్, గిరిజన మోర్చా అధ్యక్షులు వెంకటేష్ నాయక్, పూర్వ రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు సరితరావు, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ బిఎల్ఎ1 శివాజీ రాజు ప్రత్యేక అతిథులుగా, నిన్న సాయంత్రం కొంపల్లి బిజెపి డివిజన్ ఓబిసి మోర్చా, యువమోర్చా, గిరిజన మోర్చా, మైనారిటీ మోర్చా కమిటీలు నియమించడం జరిగింది. కొంపల్లి డివిజన్ బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా వల్లపు తిరుపతి, ఉపాధ్యక్షులుగా సాయి ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్, బిజెపి యువమోర్చా అధ్యక్షులుగా ఉప్పరి మహేందర్, ఉపాధ్యక్షులుగా శివలింగప్ప, ప్రధాన కార్యదర్శిగా బూడిద శ్రీకాంత్ గౌడ్, గిరిజన మోర్చా అధ్యక్షులుగా నినావత్ వినోద్ కుమార్ నాయక్, ఉపాధ్యక్షులుగా గోపీనాయక్, ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్ నాయక్, మైనార్టీ మోర్చా అధ్యక్షులుగా మహమ్మద్ మోయిన్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన మోర్చా కమిటీ భాద్యులకు చిరు సత్కరణతో శుభాకాంక్షలు తెలిపిన అనంతరం, మోర్చా కమిటీ నాయకులకు మరియు ప్రధాన కమిటీ నాయకులకు రాబోయే స్థానిక ఎన్నికలలో దృష్టిలో ఉంచుకొని, కొంపల్లి డివిజన్ బిజెపి గెలిచి విధంగా ముఖ్య అతిథులు దిశా నిర్దేశం చేశారు. భవిష్యత్తులో ప్రధాన కమిటీతో పాటు, మోర్చా కమిటీలు కూడా పోటీపడి పనిచేసి, ఈ కొంపల్లి గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తామని పూర్తి నమ్మకం నాకు ఉన్నది. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జీవన్ రెడ్డి, గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, ఓబీసీ నాయకులు అశోక్, డివిజన్ సీనియర్ నాయకులు చక్రధర్, నరసింహ, మహిళా మోర్చా నాయకురాలు మాధురి, ఆశ, భారతి, చంద్రకళ, విజయలక్ష్మి, వేదశ్రీ, ఉపాధ్యక్షులు దుర్గ, ప్రకాష్ రావు, మహేశ్వర్ రెడ్డి, ఆకుల శ్రీనివాస్, ప్రధానకార్యదర్శులు మధు, నర్సింగ్ రావు, కార్యదర్శులు శ్రీకాంత్, డివిజన్ నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# బోనాల పండుగ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ ఆగష్టు 23(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ సందర్భంగా నియోజకవర్గంలోని బాచుపల్లి డబుల్ బెడ్ రూమ్ పరిధిలో మరియు రాజీవ్ గాంధీ నగర్ ప్రాంతాల్లోని శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ మరియు శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ తల్లి ఆలయాల్లో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని, నియోజకవర్గంలో శాంతి, అభివృద్ధి, సౌభ్రాతృత్వం మరింతగా వెల్లివిరియాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, ఘనమైన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ పవిత్ర పండుగను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు స్థానిక ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# బాపూజీనగర్ బస్తీల్లో వెలుగులు నింపిన స్ట్రీట్ లైట్లు



ముషీరాబాద్, ఆగస్టు 23: ముషీరాబాద్ నియోజకవర్గంలోని ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీల్లో స్ట్రీట్ లైట్లు పనిచేయకపోవడంతో రాత్రివేళ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను స్థానికులు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి స్ట్రీట్ లైట్ల మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. బీఆర్ఎస్ సీనియర్ నేత పూస గోరక్ నాథ్ విద్యుత్ దీపాల మరమ్మత్ పనులను పర్యవేక్షించారు. దీంతో బస్తీలు, కాలనీల్లో వీధి దీపాలు తిరిగి వెలుగులు నింపాయి. స్ట్రీట్ లైట్ల సమస్యను తక్షణమే పరిష్కరించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో పాటు యువ నాయకుడు ముఠా జయసింహకు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతూ ధన్యవాదాలు తెలిపారు.

VOICE OF PRAJALU వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..

హైదరాబాద్
సోమవారం 24 ఆగస్టు 2026





# ఘనంగా మున్నూరు కాపు సత్రం అదనపు గదుల ప్రారంభోత్సవం

**ఘనపతి హోమం, వాస్తు హోమం, శివకళ్యాణంతో ఆధ్యాత్మిక సందడి**

**మున్నూరు కాపు సమాజం ఐక్యతకు, సేవా స్ఫూర్తికి శ్రీ రాజరాజేశ్వరి నిత్యాన్నదాన సత్రం ప్రతీక**

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**వేములవాడ, ఆగస్టు 24 (వాయిస్ టుడే):** వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరి మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్ర భవనంలో నిర్మించిన అదనపు గదుల ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘనపతి హోమం, వాస్తు హోమం, శివకళ్యాణం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమానికి వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ దండే విఠల్, వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, తెలంగాణ మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు, మాజీ మేయర్ రామ్మోహన్, మాజీ జడ్పీ చైర్మన్ దావత్ వసంత, చీఫ్ అడ్వైజర్ సుంకరి బాలకిషన్, అపెక్స్ కమిటీ కన్వీనర్ మీసాల చంద్రయ్య, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్, తెలంగాణ మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ పటేల్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

## ఐక్యతకు, సేవా స్ఫూర్తికి ప్రతీక

ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మున్నూరు కాపు సమాజం ఐక్యతకు, సేవా స్ఫూర్తికి శ్రీ రాజరాజేశ్వరి నిత్యాన్నదాన సత్రం ప్రతీకగా నిలుస్తోందన్నారు. భక్తులు, యాత్రికులు, పేదలకు నిత్యాన్నదానంతో పాటు వసతి సౌకర్యం కల్పించేలా సత్రం అభివృద్ధి చెందడం అభినందనీయమన్నారు. సత్రం అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని తెలిపారు.

## సమాజ సేవకు సత్రం వేదికగా నిలవాలి

ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ శ్రీ రాజరాజేశ్వరి మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రం సేవా కార్యక్రమాలకు వేదికగా అభివృద్ధి చెందడం సంతోషకరమన్నారు. భక్తులు, యాత్రికులకు వసతి, అన్నదానం అందించడం ద్వారా సత్రం సమాజానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. మున్నూరు కాపు సమాజం ఐక్యతతో ముందుకు సాగుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

## భక్తులకు మరింత సౌకర్యం

వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ వేములవాడకు ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో భక్తులు, యాత్రికులు వస్తుంటారని, వారికి వసతి, అన్నదానం అందించడంలో శ్రీ రాజరాజేశ్వరి మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రం చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అదనపు గదుల నిర్మాణంతో మరింత మందికి వసతి కల్పించే అవకాశం ఏర్పడిందన్నారు. సత్రం అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## సేవా సంస్థలు మరింత బలోపేతం కావాలి

మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరినీ కలుపుకొని సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మున్నూరు కాపు సమాజ అభ్యున్నతితో పాటు ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచేలా ఇటువంటి సేవా సంస్థలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు.

## ఐక్యత, సేవా భావం మరింత బలపడాలి

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్ మాట్లాడుతూ సమాజంలో ఐక్యత, సేవా భావం మరింత బలపడాల్సిన అవసరం ఉందన్నారు. నిత్యాన్నదాన సత్రం ద్వారా అందిస్తున్న సేవలు సమాజానికి గర్వకారణమని పేర్కొన్నారు.


## సమాజ అభివృద్ధికి సమష్టి కృషి అవసరం

అపెక్స్ కమిటీ కన్వీనర్ మీసాల చంద్రయ్య మాట్లాడుతూ మున్నూరు కాపు సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీ రాజరాజేశ్వరి నిత్యాన్నదాన సత్రం కేవలం అన్నదానం, వసతి కల్పించే కేంద్రంగా మాత్రమే కాకుండా సమాజ సేవకు మరింత విస్తృత వేదికగా ఎదగాలని ఆకాంక్షించారు. దాతలు, సమాజ బాంధవ్యులు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు.

## దాతల సహకారంతో సత్రం అభివృద్ధి

సత్రం వ్యవస్థాపక అధ్యక్షులు, ట్రస్టు సభ్యులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ మాట్లాడుతూ మున్నూరు కాపు సమాజ సేవా సంకల్పంతో సత్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాతలు, సమాజ బాంధవ్యుల సహకారంతో నిత్యాన్నదాన కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని చెప్పారు. భక్తులు, యాత్రికులు, పేదలకు వసతి కల్పించడంతో పాటు సత్రాన్ని మరింత అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో అదనపు గదులను నిర్మించినట్లు వెల్లడించారు. సత్ర నిర్మాణం, అదనపు గదుల ఏర్పాటుకు సహకరించిన ప్రతి దాతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సత్రం నిర్వాహకులు మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల ప్రవీణ్ కుమార్, మున్నూరు కాపు యువత రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్, మున్నూరు కాపు డెవలప్‌మెంట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల రవి, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎర్రం సంజీవ్, సీరిగిరి విక్రమ్, బిళ్ళకంటి శ్రీనివాస్ తదితరులను ఘనంగా సన్మానించి, శ్రీ రాజరాజేశ్వర స్వామివారి చిత్రపటాలను అందజేశారు.





## జర్నలిస్టు ఫోరం సేవలకు అభినందన

తెలంగాణ మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ పటేల్ మాట్లాడుతూ మున్నూరు కాపు సమాజ సేవలో నిత్యాన్నదాన సత్రం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. దాతల సహకారంతో సత్రం మరింత అభివృద్ధి చెందడం సంతోషకరమని తెలిపారు. భవిష్యత్తులో సత్రం ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

## ఘనంగా సన్మానాలు

కార్యక్రమానికి విచ్చేసిన శ్రీ అగస్త్య పీఠం పీఠాధిపతి పూజ్యశ్రీ సుగుణ నంద మహర్షి నరసింహారావు భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం గది దాతలు, అన్నదాన దాతలు, ప్రజాప్రతినిధులు, సత్ర ఫౌండర్ ట్రస్టు, సత్ర నిర్మాణ ట్రస్టు బోర్డు సభ్యులు, నూతన డైరెక్టర్లను ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో తెలంగాణ మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం జిల్లా అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్ పటేల్, మున్నూరు కాపు సంఘం చొప్పదండి నియోజకవర్గం ఇన్‌చార్జి మడ్లపల్లి శ్రీనివాస్ పటేల్, జర్నలిస్టు ఫోరం ప్రతినిధులు గోలి రవి పటేల్, సుగుణాకర్ పటేల్, గాండ్ల శేఖర్ పటేల్, మధు పటేల్ తదితరులు పాల్గొన్నారు. ఆధ్యాత్మిక, సేవా స్ఫూర్తితో కొనసాగిన ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు, మున్నూరు కాపు బాంధవ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# నిర్మల్ జిల్లాలో మాలల ఆందోళన - మాల కోఆర్డినేషన్ ఫోరం జిల్లా సదస్సు

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే)ఆగస్టు 23: నిర్మల్ జిల్లాలో జరిగినటువంటి సమావేశ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ రోస్టర్ విధానం వల్ల మాల విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని మాలా కోఆర్డినేషన్ ఫోరం మాల కోఆర్డినేషన్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఎం.ఎఫ్. గోపీనాథ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం నిర్మల్ లోని టీఎన్జీవో భవన్ లో మాల కోఆర్డినేషన్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహించారు. జిల్లా నాయకుడు మురళి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి గోపీనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.




రోస్టర్ పాయింట్ 22 వల్ల నష్టం: వర్గీకరణలో భాగంగా మాలలకు విద్య, ఉద్యోగ నియామకాల్లో రోస్టర్ పాయింట్ 22 కేటాయించడం వల్ల భవిష్యత్తులో తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. ౧ తక్షణ సవరణకు డిమాండ్: రోస్టర్ పాయింట్లను తక్షణమే సవరించాలని డిమాండ్ చేశారు. సవరించే వరకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల స్ఫూర్తితో ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం కొనసాగిస్తామన్నారు. ఐక్య పోరాటానికి పిలుపు: మాల జాతి హక్కులు, భవిష్యత్ ప్రయోజనాల పరిరక్షణ కోసం మాలలందరూ ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో మాల కోఆర్డినేషన్ ఫోరం రాష్ట్ర నాయకులు పి. శంకర్ మాట్లాడుతూ - గత మూడు దశాబ్దాలుగా మాలలపై వివిధ ఆరోపణలు, ముద్రలు వేస్తున్నా మౌనంగా ఉండటం వల్లే చారిత్రక అన్యాయం జరిగిందని, ప్రస్తుత వర్గీకరణలో సామాజిక న్యాయం దక్కలేదని అన్నారు. నిద్రమత్తు నుంచి మేల్కొని పిల్లల భవిష్యత్తు కోసం పోరాడాలని కోరారు.

మాల కోఆర్డినేషన్ ఫోరం రాష్ట్ర నాయకురాలు శకుంతల మాట్లాడుతూ ఈ న్యాయమైన పోరాటంలో మహిళలను పెద్ద సంఖ్యలో భాగస్వాములను చేయాలని, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా వర్గీకరణ జరిగిందని అభిప్రాయపడ్డారు. బత్తుల రంజిత్ మాట్లాడుతూ, జిల్లాలో మాలలు అందరూ ఐక్యంగా కలిసికట్టుగా పోరాడి రోస్టర్ విధానాన్ని . వాళ్ల వల్లకి నిరుద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు, ఈరోజు సరి విధానం అందరూ కలిసికట్టుగా ఉండి ఐక్యమొత్తంగా మన బలాన్ని చాటుదామని చాటి చెప్పారు, అంబేద్కర్ గారి ఆశయాలతో ముందుకు సాగాలని కోరారు అదేవిధంగా ఈ కార్యక్రమంలో మాలలు పెద్ద ఎత్తులో పాల్గొని విజయవంతంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి డాక్టర్ ఎమ్ ఎఫ్ గోపీనాథ్ శంకర్ శకుంతల కుంటల వెంకటస్వామి దామ భూమేష్ రంజిత్ మురళీధర్ పురుషోత్తం సిద్దు తదితరులు పాల్గొన్నారు



## సదుల నగర్ గ్రామంలో గల ఆంజనేయస్వామి దేవస్థానం దగ్గర సత్యనారాయణ వ్రతం నిర్వహించిన ఆంజనేయ స్వామి భక్తులు

వాయిస్ టుడే ( సంగారెడ్డి): హత్నూర మండల పరిధిలో ని సాధుల నగర్ గ్రామంలో గల ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణమాసం పురస్కరించుకొని సత్యనారాయణ స్వామి వ్రతం సాదులనగర్ గ్రామస్తులు నిర్వహించారు ఈ సందర్భంగా సాదుల నగర్ గ్రామస్తులు మాట్లాడుతూ స్వామివారికి అభిషేకాలు చందన అలంకరణ ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు దంపతులు సామాజిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు సదుల నగర్ గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని వారి మొక్కులు చెల్లించుకున్నారు ఈ కార్యక్రమంలో సదుల నగర్ హనుమాన్ దేవాలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు




## ఎస్సీ హాస్టల్‌కు రూ.15 వేల విలువైన వైట్‌బోర్డులు, విద్యా సామగ్రి విరాళం

కృష్ణాజిల్లా/గన్నవరం(వాయిస్ టుడే): విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడాలనే ఉద్దేశంతో ఏఎస్ ఆర్ లా అసోసియేట్ తరఫున గన్నవరం ప్రముఖ న్యాయవాది అమర్తల సోమేశ్వరరావు తేలప్రోలులోని ఎస్సీ హాస్టల్‌కు రూ.15,000/- విలువైన వైట్‌బోర్డులతో పాటు విద్యార్థులకు అవసరమైన పలు విద్యా సామగ్రిని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా అమర్తల సోమేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే ప్రధాన ఆధారం అని, వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని కోరారు. ఎస్సీ హాస్టల్ విద్యార్థుల విద్యా అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.15 వేల విలువైన వైట్‌బోర్డులు, అవసరమైన సామగ్రిని అందించడం పట్ల హాస్టల్ వార్డెన్, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల అభివృద్ధికి ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని ఏఏయస్ ఆర్ లా అసోసియేట్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమర్తల సోమేశ్వరరావుతో పాటు న్యాయవాదులు రామిశెట్టి విమల్ కుమార్, దుడ్ల శ్రీకాంత్, పరిమి శివకృష్ణ, కందిమల్ల వేణుమాధవ్, హాస్టల్ వార్డెన్ గుళ్లపల్లి శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## యాదవ యువజన కమిటీ నూతన కార్యవర్గం



భద్రాద్రి కొత్తగూడెం/వాయిస్ టుడే : అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో కొత్తగూడెం యాదవ యువజన పట్టణ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్తగూడెంలోని జీఎస్ ఫంక్షన్ హాల్‌లో యాదవ సంఘం జిల్లా నాయకులు కోదాడ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు చిలక రవి నేతృత్వంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. యువజన పట్టణ కమిటీ అధ్యక్షుడిగా పల్లా దేవి వరప్రసాద్ యాదవ్‌ను ఎన్నుకోగా, ఉపాధ్యక్షులుగా అశోక్ యాదవ్, ఆవాల సునీల్ యాదవ్, సూరిమేని హరీష్ యాదవ్‌లను ఎంపిక చేశారు. కార్యదర్శులుగా కంచం మధు యాదవ్, అమృతపల్లి ప్రణీత్ యాదవ్, బైకాను హరిప్రసాద్ యాదవ్, ముత్యాల అజయ్ యాదవ్‌లను నియమించారు. కోశాధికారిగా మీసా వేణు యాదవ్, సహాయ కోశాధికారులుగా మామిడి శ్రీనివాస్ యాదవ్, కంచం సందీప్ యాదవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ యాదవ సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. పట్టణంలోని యాదవ యువతను ఐక్యం చేసి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు. నూతన కార్యవర్గ సభ్యులను యాదవ సంఘం పెద్దలు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



## పునుకుడు చెలకలో ఉచిత కంటి వైద్య శిబిరం

భద్రాద్రి కొత్తగూడెం/వాయిస్ టుడే : లక్ష్మీదేవిపల్లి మండలం పునుకుడు చెలక గ్రామపంచాయతీ పరిధిలోని మర్రిగూడెం గ్రామంలో ఈ నెల 26న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సిపిఐ లక్ష్మీదేవిపల్లి మండల కార్యదర్శి దీటి లక్ష్మీపతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకర హాస్పిటల్, హైదరాబాద్ వారి సహకారంతో నిర్వహించే ఈ శిబిరంలో ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి, కంటి సంబంధిత సమస్యలకు వైద్యుల సూచనలు, చికిత్స అందించనున్నారని, కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి అన్ని రకాల కంటి ఆపరేషన్లను ఉచితంగా చేయనున్నట్లు అన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి రేగళ్ల, మైలారం, గటుమల్ల, పునుకుడు చెలక, బంగారు చిలక, చింతకుంట, బొజ్జలగూడెం తదితర గ్రామపంచాయతీల ప్రజలు హాజరై తమ కంటి సమస్యలకు పరిష్కారం పొందాలని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగపడే ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు జలీల్ పాషా,సర్పంచ్ రాంబాబు, ఉపసర్పంచ్ భద్య, చందులాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఝరాసంగం, జహీరాబాద్‌లో శుభకార్యాల్లో పాల్గొన్న జహిరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు

ఝరాసంగం, ఆగస్టు 23 (వాయిస్ టుడే): జహీరాబాద్ పట్టణంలో జరిగిన గృహప్రవేశ వేడుకతో పాటు ఝరాసంగం మండల కేంద్రంలో నిర్వహించిన నిశ్చితార్థ వేడుకల్లో జహీరాబాద్ ఎమ్మెల్యే శ్రీ కొనింటి మాణిక్ రావు పాల్గొని, నూతన దంపతులు మరియు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఝరాసంగం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, మాజీ ఆత్మ చైర్మన్ విజయ్ కుమార్, ఎఫ్ఎంసీ చైర్మన్ సత్యం ముదిరాజ్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు నరసింహారెడ్డి, హద్నూర్ గ్రామ సర్పంచ్ ప్రవీణ్, ఝరాసంగం గ్రామ సర్పంచ్ వినోద్ బాలరాజ్, నాయకులు రాజేందర్ రెడ్డి, మల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శశివర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## శాంతినగర్ మున్నూరు కాపు సంఘం నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

సూర్యాపేట జిల్లా, ఆగస్టు 24 (వాయిస్ టుడే): అనంతగిరి మండలం శాంతినగర్ గ్రామంలో మున్నూరు కాపు సంఘం (పటేల్) సమావేశం నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా మున్నూరు కాపు సంఘాన్ని బలోపేతం చేసేందుకు అందరూ ఐక్యంగా పనిచేయాలని +హీూ ఫౌండర్ సంగని రజినీకాంత్ సందేశం ద్వారా పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి సూర్యాపేట జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు రామసాని శ్రీనివాస నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉద్యోగ సంఘాల సలహాదారు కందికొండ శ్రీనివాస్, కోదాడ నియోజకవర్గ కో-కన్వీనర్ శెట్టి విజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో శాంతినగర్ మున్నూరు కాపు సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### నూతన కమిటీ

అధ్యక్షులు: నీలం నాగభద్రం
ఉపాధ్యక్షులు: నీలం నెహ్రూ
సెక్రటరీ: శెట్టి నారాయణ
కోశాధికారి: నీలం వెంకటరమణ
యువత మండలి అధ్యక్షులు: నీలం ఉపేందర్ (రంగయ్య కుమారుడు)
యువత మండలి ఉపాధ్యక్షులు: నీలం రాజేష్ (అచ్చయ్య కుమారుడు)

### గౌరవ సలహాదారులు

నీలం వెంకటనర్సయ్య, శెట్టి వెంకటేశ్వర్లు (సార్), నీలం రంగయ్య (మాజీ సర్పంచ్), శెట్టి పెద్ద వెంకటేశ్వర్లు, నీలం చిన్న రంగయ్యలను గౌరవ సలహాదారులుగా ఎంపిక చేశారు.

### సీనియర్ కమిటీ సభ్యులు

శెట్టి రామకృష్ణ, నీలం లక్ష్మీనారాయణ, నీలం కొండయ్య, నీలం సూరయ్య, నీలం నర్సింహారావు, శెట్టి సీతయ్య, నీలం అచ్చయ్య, వజ్రపు లక్ష్మయ్య, వెంకటగిరి శ్రీను, నీలం భాస్కర్ (మేస్త్రి)లను సీనియర్ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

### యువ సభ్యులుగా..

నీలం రాజేష్ (సూరయ్య కుమారుడు), నీలం గోపి (కొండలు కుమారుడు), నీలం శ్రీమాన్, నీలం అనిల్, పసుపులేటి ఉపేందర్, కోల రాము, నీలం గోపి, నీలం భాస్కర్ (అచ్చయ్య కుమారుడు), నీలం సాయి కుమార్, నీలం కృష్ణలను యువ సభ్యులుగా ఎంపిక చేశారు. ఈ ఎన్నికల ప్రక్రియను ఏనుగుల వీరాంజనేయులు, పోతూరాజు శ్రీనివాస్ రావు, కంబాల ప్రసాద్, వేముల శ్రీనివాస్ పర్యవేక్షించారు. అనంతరం సంఘం భవిష్యత్ కార్యాచరణ, అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై సభ్యులు సలహాలు, సూచనలు అందించారు. మున్నూరు కాపు సంఘం అభివృద్ధి, ఐక్యత కోసం నూతన కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు.



## శబరిమల అయ్యప్ప సేవ సమాజం జిల్లా కమిటీ సభ్యులుగా ఇద్దరు గురు స్వాములు

సంగారెడ్డి (వాయిస్ టుడే) : శబరిమల అయ్యప్ప సేవా సమాజం సంగారెడ్డి జిల్లా నూతన కమిటీలో హత్నూర మండలానికి చెందిన గురుస్వాములు గణేష్, ఆంజనేయులు గౌడ్ లకు అవకాశం దక్కింది. జిల్లా కమిటీ సభ్యులుగా హత్నూర గ్రామానికి చెందిన గురు స్వామి ఆంజనేయులు గౌడ్, దౌల్తాబాద్ గ్రామానికి చెందిన గణేష్ గురు స్వాములకు జిల్లా కమిటీ సభ్యులుగా నియమిస్తూ జాతీయ ప్రధాన కార్యదర్శి గురు స్వామి తోపాటు రాష్ట్ర కమిటీ నాయకులు నియామక పత్రాన్ని అందజేయడంతో పాటు శాలువా మెమెంటో తో సత్కరించారు. ఈ సందర్భంగా నూతనంగా జిల్లా కమిటీ సభ్యులుగా బాధ్యతలు చేపట్టిన గణేష్, ఆంజనేయులు గౌడ్ గురు స్వాములు మాట్లాడుతూ శబరిమల అయ్యప్ప సేవా సమాజం జిల్లా కమిటీలో అవకాశం కల్పించినందుకు రాష్ట్ర జిల్లా కమిటీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే హత్నూర మండల స్థాయి కమిటీని కూడా ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. అయ్యప్ప సేవా సమాజం తరపున సామాజిక కార్యక్రమాలు, ధార్మిక కార్యక్రమాలు సైతం నిర్వహించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు.



## ఆంజనేయస్వామి దేవాలయంకి డమరుకం అందజేసిన కమ్మరి వేమాచారి

సంగారెడ్డి (వాయిస్ టుడే) : హత్నూర మండల పరిధిలోని సాదుల నగర్ గ్రామంలో లో గల శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం కి సుమారు 22 వేల రూపాయలు విలువచేసే డమరుకాని అందజేశారు ఈ సందర్భంగా కమ్మరి వేమచారి మాట్లాడుతూ.. గ్రామ ప్రజలందరికీ ఆంజనేయ స్వామి కృప ఎల్లప్పుడూ ఉండాలని ఆయన తెలిపారు స్వామికి రాబోయే రోజుల్లో తన వంతుగా మరిన్ని కార్యక్రమాలు చేపడతానని వేమచారి తెలిపారు ఈ కార్యక్రమంలో ఆంజనేయ స్వామి భక్తులు గ్రామస్తులు గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

RNI No: TGTEL/25/A2649 VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం.. తెలుగు దినపత్రిక





## భోంగొండ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన జహిరాబాద్ పాల్గొన్న ఎమ్మెల్యే మాణిక్ రావు

ఝరాసంగం, ఆగస్టు 23 (వాయిస్ టుడే) : న్యాల్కల్ మండలం కల్బేమల్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన భోంగొండ మహారాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని శనివారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భోంగొండ మహారాజ్ ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల విశ్వాసానికి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచే విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, ఝరాసంగం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, మాజీ ఆత్మ చైర్మన్ విజయ్ కుమార్, ఎఫ్ఎంసీ చైర్మన్ సత్యం ముదిరాజ్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు నరసింహారెడ్డి, రాజేందర్ రెడ్డి, సర్పంచులు ప్రవీణ్, బి. ప్రవీణ్, గ్రామ సర్పంచ్ శివకుమార్, మాజీ సర్పంచ్ మహిపాల్, పార్టీ అధ్యక్షుడు బి. శంకర్‌తో పాటు నాయకులు రవికుమార్, మారుతి, వినోద్, మల్లారెడ్డి, పీటర్, ఇమ్రాన్, చంద్రు, మారుతి పాటిల్, చంద్రన్న, శివన్న, నవీన్, నాగేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ ఎంపికలో దళారులను నమొద్దు
### సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా



(భద్రాచలం, ఆగస్టు 23 : జిల్లాలో అంగన్వాడీ టీచర్లు, సహాయకుల పోస్టుల భర్తీకి చేపట్టిన ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని సంక్షేమ అధికారి స్వర్ణలత లెనీనా ఒక ప్రకటన లో తెలిపారు. ఎంపిక ప్రక్రియ పూర్తిగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించనున్నట్లు తెలిపారు. అంగన్వాడీ టీచర్లు, సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఎటువంటి దళారులను నమ్మి మోసపోవద్దని ఆమె సూచించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని, తమకు పరిచయాలు ఉన్నాయని చెప్పే వ్యక్తులను నమ్మి డబ్బులు చెల్లించవద్దని హెచ్చరించారు. అంగన్వాడీ టీచర్లు, సహాయకు ల ఎంపిక ప్రక్రియకు కలెక్టర్ చైర్మన్ గా వ్యవహరిస్తారని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, నిర్దేశించిన అర్హతలు, రిజర్వేషన్ నిబంధనలు, మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ జరుగుతుందని స్పష్టం చేశారు. ఎవరికి ఉద్యోగం వస్తుందో ముందుగా ఎవరికీ తెలియదని, ఎంపిక పూర్తిగా నిబంధనల ప్రకారం జరుగుతుందని జిల్లా సంక్షేమ అధికారి పేర్కొన్నారు. అభ్యర్థులు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా, దళారులను ఆశ్రయించకుండా అధికారిక ప్రక్రియ పై మాత్రమే ఆధార పడాలని లేనీనా సూచించారు. వచ్చే వారంలో అంగన్వాడీ టీచర్లు, సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ముఖాముఖి (ఇంటర్వ్యూ) నిర్వహించే అవకాశం ఉందని, ఇందుకు సంబంధించిన వివరాలను అధికారికంగా తెలియజేస్తామని జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా తెలిపారు.

## చిరు అభిమానికి చిరు బీమా ఇన్సూరెన్స్



పెద్దపల్లి జిల్లా: 23. ఆగస్టు (వాయిస్ టుడే) గోదావరిఖని: మెగాస్టార్ చిరంజీవి 71. సంవత్సరం పుట్టినరోజును పురస్కరించుకొని వీర అభిమానుల కానుకగా గోదావరిఖనికి చెందిన చిరు వీరాభిమాని రాష్ట్ర చిరంజీవి యువత నేత రోడ్డ శ్రీనివాస్ కు చిరు బీమా ఇన్సూరెన్స్ ను హైదరాబాద్ బ్లడ్ బ్యాంకు నుండి రోడ్డ శ్రీనివాస్ కు అందించారు ఈ ప్రాంతంలో రోడ్డ శ్రీనివాస్ కు ఒక్కడికే ఈ చిరు బీమా రావడం పట్ల ఇక్కడి చిరంజీవి ఫ్యాన్స్ గట్ల రమేష్, నెల కంటి రాము, ఇండ్ల ఓదెలు, బడికెల తిరుపతి, గంధం మహేందర్, ఆనందం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## లైన్స్ క్లబ్ ఆఫ్ మక్తల్ భీమా ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ సేవా కార్యక్రమం

మక్తల్ ఆగస్టు 23 (వాయిస్ టుడే ప్రతినిధి) : నేడు లయన్ బి. అంబాదాస్ రావు రావు గారి ఆధ్వర్యంలో లయన్ గూడూరు శరణప్ప గారి కుటుంబ సభ్యుల సహకారంతో వారి మనుమరాలు శ్రీనిక D/OG.అమరేష్ గీత యొక్క జన్మదిన సందర్భంగా శ్రీ పడమటి ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ సేవా కార్యక్రమం నిర్వహించడం జరిగినది లయన్స్ క్లబ్ ఆఫ్ మక్తల్ బీమా ప్రజలకు వివిధ సేవా కార్యక్రమాలతో పాటు అన్నప్రసాద్ వితరణ కూడా సేవలో భాగంగా నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు ఇట్టి కార్యక్రమంలో లయన్ సభ్యులు డాక్టర్ శ్రీరామ్ వీ.రఘు ప్రసన్న బట్ తాన్సింగ్, జైపాల్ రెడ్డి కొండ విజయకుమార్ డాక్టర్ మణికంత గౌడ్ పాపిరెడ్డి, కాకులారం అశోక్ మరియు లైన్ శరణప్ప గారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు




## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న
### ముధోల్ మాజీ శాసనసభ్యులు శ్రీ జి. విఠల్ రెడ్డి



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఆగస్టు 23: తానూరు మండలంలోని భామిని గ్రామంలో భూమేష్ ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఇచ్చినందుకు మన గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మరియు గృహ నిర్మాణ శాఖ మాత్యులు గౌరవనీయులు శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి కి మరియు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి గౌరవనీయులు శ్రీ జూపల్లి కృష్ణారావు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన మాజీ శాసనసభ్యులు శ్రీ జి.విఠల్ రెడ్డి. ఈ కార్యక్రమంలో బైంసా మున్సిపాలిటీ చైర్మన్ తుమ్మోళ్ల దత్తు, బైంసా మార్కెట్ ఆనందరావు పటేల్, మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ రాజన్న, మాజీ జెడ్పిటిసి ఉత్తమ్ బాలేరావు, మాజీ ఆత్మ చైర్మన్ పోతారెడ్డి, మరియు స్థానిక ఉప సర్పంచ్ గంగాధర్, వార్డు మెంబర్లు లాల్ అన్న, యోగేష్ బాలాజీ,మరియు సర్పంచులు రోహిదాస్,కృష్ణ, మాజీ ఎంపీటీసీ పోశెట్టి,మౌలాఖాన్, నాయకులు గురు చరణ్,సాయినాథ్,మెడికల్ సాయినాథ్,మరియు గ్రామ పెద్దలు మండల సీనియర్ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు ఉన్నారు.



## గన్నవరంలో నూతన సాహిత్య వేదిక సాహితీ సంగమం" ఏర్పాటు

కృష్ణా జిల్లా/గన్నవరం(వాయిస్ టుడే): సాహిత్యం మానవ వికాసానికీ,సమాజ ప్రగతికీ తోడ్పడాలని గన్నవరం గ్రేడ్-1 గ్రంథాలయం ప్రధాన అధికారి కంచల నాగరాజు ఆకాంక్షించారు. గన్నవరం ఎన్జీవో హోమ్ లో ఆదివారం నాడు "సాహితీ సంగమం" సంస్థ ఏర్పాటయింది. సంస్థ లోగోను నాగరాజు ఆవిష్కరించారు. పలువురు కవులు, రచయితలు, సాహితీ అభిమానులు కలిసి ఒక వేదికను ఏర్పాటు చేసుకోవడం సంతోషదాయకమని ఈ సంస్థ వివిధ సందర్భాలను పురస్కరించుకొని సాహిత్య కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ప్రముఖ కవయిత్రి కోడే యామినీ దేవి మాట్లాడుతూ తమ సంస్థ "నవత - మమత - సమత" లక్ష్యాలతో పనిచేస్తుందని, అన్ని రచనా ప్రక్రియల సృజనకారులందరికీ ఇది వేదికగా పనిచేస్తుందని అన్నారు. రాబోయే రోజుల్లో సంస్థను మరింత విస్తృత పరుస్తామని అన్నారు. ఈ నెల 29న తాము నిర్వహించే ప్రపంచ తెలుగు భాషా దినోత్సవంలో తెలుగు భాషాభిమానులందరూ పాల్గొనాలని కోరారు. అనంతరం నూతన కమిటీ ఏర్పడింది. గౌరవాధ్యక్షులుగా రాజాబాబు కంచర్ల, అధ్యక్షురాలుగా కోడే యామినీ దేవి, ఉపాధ్యక్షులుగా వై శ్రీనివాసరావు, రొంపెల్లి అచ్యుతరావు, విజయ శ్రీముఖి, ప్రధాన కార్యదర్శిగా ఉడతా రామకృష్ణ, కార్యదర్శిగా ధనియాల అప్పారావు, సహాయ కార్యదర్శిలుగా పి నాగరాజరావు, ఎన్ వి ఎన్ ఎస్ స్వామి, రామినేని రవిబాబు, కోశాధికారిగా ఎల్ గంగాధరరావు, సభ్యులుగా పి. మహేష్, డి ఉదయ్ కుమార్, అప్పారావు, ప్రసాద్ మాస్టారు, గౌరవ సలహాదారుగా ఎస్ కె సుభానీ ఎన్నికయ్యారు.



## హంగిర్గకు రూ.కోటిన్నర అభివృద్ధి నిధులు
### శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపనలో ఎమ్మెల్యే రామారావు పటేల్

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే)ఆగస్టు 23: తానూర్ మండలంలోని హంగిర్గ గ్రామ అభివృద్ధికి సుమారు రూ.కోటిన్నర నిధులు మంజూరైనట్లు ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలిపారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ సీజీఎఫ్ నిధుల నుంచి రూ.50 లక్షలతో చేపట్టనున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కళ్యాణ మండపం, రోడ్లు, డ్రైనేజీతో పాటు హిప్నెల్లి నుంచి సరస్వతి నగర్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. అంగన్‌వాడీ, వివో భవనాలు, గ్రామపంచాయతీ భవనం తదితర అభివృద్ధి పనులకు సుమారు రూ.కోటిన్నర వరకు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. తానూర్ మండలానికి సంబంధించిన 27 ప్యాకేజీ అంశాన్ని పలుమార్లు అసెంబ్లీలో ప్రస్తావించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ ప్యాకేజీ పూర్తి చేయడానికి రూ.700 కోట్లకు పైగా బడ్జెట్ అవసరమవుతుందని తెలిపారు. రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని 27 ప్యాకేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 27 ప్యాకేజీ పూర్తయితే తానూర్ మండలం మొత్తం వ్యవసాయ రంగంలో సస్యశ్యామలంగా మారుతుందని పేర్కొన్నారు.గ్రామంలో ఉన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గ్రామస్తులకు భరోసా ఇచ్చారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల సీనియర్ నాయకులు,గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## డయల్ యువర్ ఎమ్మెల్యే కాల్‌కు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు

**మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతులతో నీటి ఇబ్బందులు**

**తక్షణమే వాటర్ ట్యాంకర్ల ఏర్పాటు**

**పైపులైన్ పనులు పూర్తయ్యే వరకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ఆదేశాలు**



హనుమకొండ, ఆగస్టు 23(వాయిస్ టుడే): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని తక్షణమే పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన 'డయల్ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమానికి వచ్చిన ఫోన్‌కాల్‌కు వర్ధన్నపేట ఎమ్మెల్యే అధికారి కే.ఆర్ నాగరాజు వెంటనే స్పందించారు. వర్ధన్నపేట నియోజకవర్గంలోని 65వ డివిజన్ ఎల్లాపూర్, దేవన్నపేటతో పాటు పలు గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులైన్ల మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో స్థానిక ప్రజలు 'డయల్ యువర్ ఎమ్మెల్యే' నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వెంటనే వాటర్ ట్యాంకర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో ఆయా కాలనీలు, గ్రామాలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టారు. మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతు పనులు పూర్తయ్యే వరకు ఆయా గ్రామాలు, కాలనీలకు ట్యాంకర్ల ద్వారా నిరంతరాయంగా నీటిని సరఫరా చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

**సమస్య ఉంటే నేరుగా ఎమ్మెల్యేకు ఫోన్ చేయండి..**

వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలు తమ ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా 'డయల్ యువర్ ఎమ్మెల్యే' నంబర్‌కు ఫోన్ చేసి తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు సూచించారు. ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలు పరిష్కారమయ్యేలా చొరవ చూపాలని కోరారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.



## జూలైవాడ జంక్షన్‌లో ఘనంగా బోనాల మహోత్సవం
### అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఛీఫ్ విప్ వినయ్ భాస్కర్

హనుమకొండ, ఆగస్టు 23(వాయిస్ టుడే): జూలైవాడ జంక్షన్‌లో బోనాల మహోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని, తరతరాలుగా కొనసాగుతున్న ఈ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. బోనాల పండుగ సందర్భంగా జూలైవాడ జంక్షన్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించగా, భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో జూలైవాడ జంక్షన్ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కరీంనగర్ బ్రాంచ్‌లో ఘనంగా 'మాస్టర్ ఒరేటర్ కాంటెస్ట్' పోస్టర్ల ఆవిష్కరణ




కరీంనగర్,ఆగస్టు 23(వాయిస్ టుడే): బ్రాంచ్‌లో విద్యార్థుల నైపుణ్యాలను,వక్తృత్వ పటిమను పెంపొందించే ఉద్దేశంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే 'మాస్టర్ ఒరేటర్ కాంటెస్ట్' పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్లను శనివారం బ్రాంచ్ ప్రాంగణంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జీఎం గోపాల్ రెడ్డి,ఏజీఎం చైతన్య రావు,ఆర్ ఐ సత్యం రావుసంయుక్తంగా ఈ పోటీల పోస్టర్లను విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను,వేదిక భయాన్ని పోగొట్టి అద్భుతమైన వక్తలుగా తీర్చిదిద్దడానికి ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. లైఫ్ స్కిల్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థుల సమగ్ర వికాసం కోసం ఇలాంటి ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో లైఫ్ స్కిల్స్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి లఘుపతి, కరీంనగర్ బ్రాంచ్ ప్రిన్సిపాల్ రమ్య,ఇతర బ్రాంచ్ ప్రిన్సిపాల్స్, కోఆర్డినేటర్లు,ఏడీలు,వీపీలు, కరీంనగర్ బ్రాంచ్ ఏవో సతీష్, పీఈటీ సుదర్శన్ పాల్గొన్నారు.

# శాశ్వత బస్‌స్టాండ్ ఏర్పాటుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి

**43 ఏళ్లుగా హామీలే.. కార్యరూపం మాత్రం శూన్యం**

**విలేకరుల సమావేశంలో మాజీ కౌన్సిలర్ పెద్ది వెంకటనారాయణ**

**సర్వే నెం. 72, 73లో గతంలో గుర్తించిన భూమిని పరిశీలించాలి**

**రైల్వే స్థలం కోసం మరింత జాప్యం వద్దు.. స్థానికంగా అందుబాటులో ఉన్న భూమికి ప్రాధాన్యం ఇవ్వాలి**




కాజీపేట, ఆగస్టు 23(వాయిస్ టుడే): కాజీపేట పట్టణం, పరిసర ప్రాంతాల ప్రజలను దశాబ్దాలుగా వేధిస్తున్న ప్రధాన సమస్యల్లో శాశ్వత బస్‌స్టాండ్ ఏర్పాటు ఒకటి. ఈ అంశంపై మాజీ కౌన్సిలర్ పెద్ది వెంకటనారాయణ ఆధ్వర్యంలో కాజీపేటలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాజీపేటకు శాశ్వత బస్‌స్టాండ్ ఏర్పాటు కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. 1983లో తొలిసారిగా తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే అభ్యర్థులు, నాయకులు అనేక సందర్భాల్లో కాజీపేటకు బస్‌స్టాండ్ ఏర్పాటు చేస్తామని హామీలు ఇస్తూనే ఉన్నారని తెలిపారు. అయితే సుమారు 43 సంవత్సరాలు గడిచినా బస్‌స్టాండ్ మాత్రం కార్యరూపం దాల్చలేదని పేర్కొన్నారు.

**గతంలోనే భూమి గుర్తింపు**

కాజీపేటలోని కడిపికొండ శివారు సర్వే నెం. 72, 73 పరిధిలో బస్‌స్టాండ్ ఏర్పాటుకు అనువైన భూమిని గతంలో ప్రభుత్వం గుర్తించి, బస్‌స్టాండ్ కోసం హద్దులు కూడా నిర్ణయించినట్లు స్థానికంగా సమాచారం ఉందన్నారు. అయితే అనంతరం వివిధ కారణాలతో ఆ ప్రతిపాదన ముందుకు సాగకుండా నిలిచిపోయిందని తెలిపారు. గతంలో బస్‌స్టాండ్ కోసం గుర్తించిన భూమికి సంబంధించిన పాత ప్రభుత్వ రికార్డులు, రెవెన్యూ దస్తావేజులు, నిజాం కాలం నాటి రికార్డులు, భూమి హక్కులకు సంబంధించిన పత్రాలను సమగ్రంగా పరిశీలించాలని కోరారు.

**రైల్వే జంక్షన్‌కు బస్‌స్టాండ్ లేకపోవడం దురదృష్టకరం**

కాజీపేట రైల్వే జంక్షన్ కావడంతో ప్రతిరోజూ వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయని, కాజీపేటతో పాటు పరిసర గ్రామాలు, ఇతర మండలాలు, జిల్లాల నుంచి ప్రయాణికులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి చేరుతున్నారని పేర్కొన్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ప్రాంతానికి శాశ్వత బస్‌స్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లోనే బస్సుల నిలుపుదల, రాకపోకలు కొనసాగుతుండటంతో ట్రాఫిక్ సమస్యలు కూడా తలెత్తుతున్నాయని అన్నారు.

**మళ్లీ రైల్వే భూమి పేరుతో జాప్యం వద్దు..**

ఇటీవల కాజీపేటలో బస్‌స్టాండ్ కోసం రైల్వే శాఖకు చెందిన స్థలాన్ని తీసుకోవాలనే ప్రతిపాదనలు వినిపిస్తున్నాయని, అయితే రైల్వే భూమిని పొందాలంటే కేంద్ర ప్రభుత్వం, రైల్వే శాఖకు సంబంధించిన అనేక అధికారిక ప్రక్రియలు పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇప్పటికే 1983 నుంచి బస్‌స్టాండ్ పేరుతో 43 సంవత్సరాలు గడిచిన నేపథ్యంలో మరోసారి రైల్వే స్థలం కోసం ప్రయత్నిస్తూ మరింత కాలం జాప్యం చేయడం ప్రజా ప్రయోజనాలకు అనుకూలం కాదని అన్నారు.

**సర్వే నెం. 72, 73పై సమగ్ర విచారణ జరపాలి**

సర్వే నెం. 72, 73 భూమికి సంబంధించి ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని పెద్ది వెంకటనారాయణ కోరారు. ఆ భూమి ప్రస్తుత రెవెన్యూ రికార్డుల్లో ఏ విధంగా నమోదై ఉంది, గతంలో ఏ ప్రభుత్వ శాఖలు ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నాయి, బస్‌స్టాండ్ కోసం ఎప్పుడు భూమిని గుర్తించారు, ఎలాంటి హద్దులు నిర్ణయించారు, అనంతరం ఆ భూమిపై ఎలాంటి మార్పులు చోటుచేసుకున్నాయి అనే అంశాలపై పూర్తి స్థాయి రెవెన్యూ, పరిపాలనా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆ భూమి ప్రభుత్వ భూమి లేదా ప్రజా ప్రయోజనం కోసం గతంలో గుర్తించిన భూమిగా తేలితే, చట్టపరమైన ప్రక్రియను అనుసరించి దానిని ప్రజా అవసరానికి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**బస్‌స్టాండ్ ఇక హామీ కాదు.. ప్రజల అవసరం..**

కాజీపేటకు శాశ్వత బస్‌స్టాండ్ అనేది కేవలం అభివృద్ధి కార్యక్రమం కాదని, వేలాది మంది ప్రజల రోజువారీ రవాణా అవసరాలకు సంబంధించిన అత్యవసర మౌలిక సదుపాయమని పేర్కొన్నారు. రాజకీయ హామీల స్థాయిలో కాకుండా పరిపాలనా నిర్ణయంగా ఈ సమస్యను పరిగణించి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే భూమి కోసం మరింత కాలం వేచి ఉండకుండా, స్థానికంగా అనువైన భూమిని ప్రాధాన్యతగా పరిశీలించి బస్‌స్టాండ్ నిర్మాణ ప్రక్రియను ప్రారంభించాలని కోరారు.

**2026లోనైనా 1983 హామీ నెరవేరాలి..**

సర్వే నెం. 72, 73కు సంబంధించిన పూర్తి రికార్డులను వెలికితీసి, గతంలో నిర్ణయించిన హద్దులు, ప్రభుత్వ ఉత్తర్వులు, రెవెన్యూ రికార్డులను పరిశీలించడంతో పాటు బస్‌స్టాండ్ నిర్మాణానికి స్పష్టమైన కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వం ప్రకటించాలని పెద్ది వెంకటనారాయణ డిమాండ్ చేశారు. 1983లో ఇచ్చిన హామీని 2026లోనైనా కార్యరూపంలోకి తీసుకువచ్చి కాజీపేట ప్రజల చిరకాల స్వప్నమైన శాశ్వత బస్‌స్టాండ్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సేవాదళ్ నాయకులు మీరస్వామి, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గౌని సాంబయ్య గౌడ్, నాయకులు మోడెం సురేందర్, పిల్లల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



# కలశ్ వందన్ అభియాన్‌లో పాల్గొన్న బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు

నాచారం (వాయిస్ టుడే): భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ క్రాంతి కిరణ్ అభీష్టం మేరకు సమరసత సంకల్ప అభియాన్‌లో భాగంగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన కలశ్ వందన్ అభియాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసి నాగరాజు సమక్షంలో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చేతుల మీదుగా కలశాన్ని ఎస్సీ మోర్చా అర్బన్ జిల్లా అధ్యక్షుడు కటికేల సుధాకర్, ప్రధాన కార్యదర్శి మూర్తి నాగరాజు స్వీకరించారు. కార్యక్రమంలో రామంతాపూర్ బీజేపీ సీనియర్ నాయకుడు దుర్గేష్‌తో పాటు ఎస్సీ మోర్చా అర్బన్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# నిట్ వరంగల్‌లో ఘనంగా పీజీ ఓరియంటేషన్ కార్యక్రమం

**నూతన పీజీ విద్యార్థులకు స్వాగతం.. విద్యా, పరిశోధన, కెరీర్ అవకాశాలపై అవగాహన**

**అకడమిక్ విధానం, క్రెడిట్లు, హాజరు, పరీక్షలు, పరిశోధనపై నిపుణుల వివరణ**

**విభాగాల వారీగా ప్రత్యేక ఓరియంటేషన్**




కాజీపేట, ఆగస్టు 23(వాయిస్ టుడే): నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) వరంగల్‌లో నూతనంగా ప్రవేశం పొందిన పోస్టు గ్రాడ్యుయేట్ (పీజీ) విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఆదివారం పీజీ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సంస్థలోని విద్యా విధానం, పరిశోధన అవకాశాలు, విద్యార్థి సహాయక వ్యవస్థలు, కెరీర్ అవకాశాలు, క్యాంపస్‌లో అందుబాటులో ఉన్న వివిధ సౌకర్యాలపై సమగ్ర అవగాహన కల్పించారు. నిట్ వరంగల్‌లో వివిధ విభాగాలకు చెందిన 30కి పైగా పోస్టు గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఉన్నత విద్య, పరిశోధన, వృత్తిపరమైన అభివృద్ధికి ఈ ప్రోగ్రామ్‌లు విద్యార్థులకు విస్తృత అవకాశాలను అందిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వివిధ విభాగాల డీన్లు, విభాగాధిపతులు హాజరై నూతన పీజీ విద్యార్థులకు స్వాగతం పలికారు. డీన్--స్టూడెంట్ వెల్ఫేర్ ప్రొఫెసర్ కిరణ్ కుమార్ నిట్ వరంగల్‌లో అందుబాటులో ఉన్న విద్యా, కెరీర్ అవకాశాలను వివరించారు. కొత్త విద్యా వాతావరణానికి విద్యార్థులు తక్కువ వ్యవధిలో అలవాటు పడటంతో పాటు, అకడమిక్ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాల్సిన ప్రాముఖ్యతను వివరించారు. ఇన్‌స్టిట్యూట్ ఫెస్టివల్స్, వైద్య, డిస్పెన్సరీ సదుపాయాలు, లైబ్రరీ వనరులు, విద్యార్థులకు అందుబాటులో ఉన్న ఇతర సహాయక సేవలను పరిచయం చేశారు. డీన్ (అకడమిక్) ప్రొఫెసర్ వెంకయ్య చౌదరి విద్యా నిర్మాణం, కోర్సుల విధానం, సెమిస్టర్ వ్యవధి, సెమిస్టర్ రిజిస్ట్రేషన్, గ్రాడ్యుయేషన్‌కు అవసరమైన క్రెడిట్లు, హాజరు నిబంధనలు, గ్రేడింగ్, పరీక్షా విధానాలపై విద్యార్థులకు వివరించారు. అలాగే గేట్ ఫెలోషిప్ పొందేందుకు అవసరమైన సీజీపీఏ, పీహెచ్‌డీ చదివే అవకాశాలు, ఎగ్జిట్ పాలసీలు, సెలవు నిబంధనలు, విద్యా సంబంధిత సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉన్న వివిధ కమిటీలు, సహాయక వ్యవస్థల గురించి అవగాహన కల్పించారు.

**విభాగాల వారీగా ప్రత్యేక ఓరియంటేషన్..**

ఇన్‌స్టిట్యూట్ స్థాయి ఓరియంటేషన్ అనంతరం విద్యార్థులు తమ తమ విభాగాలకు వెళ్లి స్పెషలైజేషన్ ఆధారిత ఓరియంటేషన్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపకులు తమ ప్రోగ్రామ్‌ల కోర్సు నిర్మాణం, స్పెషలైజేషన్లు, ప్రయోగశాలలు, విద్యా సదుపాయాలు, పరిశోధన అవకాశాలు, విభాగ స్థాయిలో నిర్వహించే వివిధ కార్యకలాపాలపై విద్యార్థులకు వివరించారు. నూతన పీజీ విద్యార్థులకు విద్యా ప్రస్థానాన్ని సులభతరం చేయడంతో పాటు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, కెరీర్ అవకాశాలపై స్పష్టమైన అవగాహన కల్పించడంలో ఓరియంటేషన్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడిందని నిర్వాహకులు తెలిపారు.



# క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించాలి

**ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**

మానకొండుర్,ఆగస్టు 23(వాయిస్ టుడే): క్యాన్సర్ బారినపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే,టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు తొలిదశలోనే గుర్తించి సకాలంలో చికిత్స పొందేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు.మానకొండూర్ మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్ ఆవరణలో అంకిత్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ, కంటి పరీక్షల వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ,ప్రైవేటు ఆసుపత్రుల్లో క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయని తెలిపారు. అయితే ఆసుపత్రులకు వస్తున్న కేసుల్లో ఎక్కువ శాతం మూడో, నాలుగో దశకు చేరుకున్నవేనని, తొలిదశలో గుర్తించిన కేసులు చాలా తక్కువగా ఉంటున్నాయని చెప్పారు.క్యాన్సర్‌పై సరైన అవగాహన లేకపోవడం,వ్యాధి లక్షణాలను ప్రారంభంలోనే గుర్తించకపోవడం, వైద్య పరీక్షలు చేయించుకోవడంలో నిర్లక్ష్యం చేయడం వల్లే వ్యాధి ముదిరిన తర్వాత ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని పేర్కొన్నారు.ప్రజలు క్యాన్సర్ లక్షణాలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముందస్తుగా గుర్తిస్తే మెరుగైన చికిత్సతో వ్యాధిని నియంత్రించే అవకాశం ఉంటుందని తెలిపారు.క్యాన్సర్ బాధితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అర్హులైన వారికి రూ.10 లక్షల వరకు వైద్యసేవలు అందుతున్నాయని తెలిపారు. ఇకపై మానకొండూర్ నియోజకవర్గంలోని క్యాన్సర్ బాధితుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేగా తనవంతు బాధ్యత తీసుకుంటానని,ప్రభుత్వ పరంగా మెరుగైన వైద్యం అందేలా కృషి చేస్తానని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చారు. అంకిత్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కవ్వంపల్లి అనురాధ మాట్లాడుతూ,గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ, కంటి పరీక్షల వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించి వ్యాధిని నియంత్రించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముఖ్యంగా వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదించాలని కోరారు. పైలెట్ ప్రాజెక్టుగా మానకొండూరులో వైద్య శిబిరం నిర్వహించామని,ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను భవిష్యత్తులోనూ అన్ని మండలాల్లో నిర్వహిస్తూ ప్రజలకు వైద్య అవగాహన కల్పించడంతోపాటు అవసరమైన వైద్య సేవలను అందిస్తామని డాక్టర్ కవ్వంపల్లి అనురాధ తెలిపారు. మానకొండూర్ మండల కేంద్రంలో అంకిత్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది.మండలంలోని వివిధ గ్రామాల నుంచి మహిళలు భారీగా తరలివచ్చారు.ఈ ఉచిత వైద్య శిబిరంలో మూడు రకాల క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలతోపాటు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఎం.ఎన్.జె ఇన్స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ హైదరాబాద్ ప్రాంతీయ క్యాన్సర్ కేంద్రం వారు క్యాన్సర్ క్లీనింగ్ టెస్టులు నిర్వహించగా, రేకుర్తి కంటి వైద్యశాల ఆధ్వర్యంలో నేత్ర పరీక్షలు నిర్వహించారు.ఈ శిబిరంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాసరెడ్డి,పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపల్లి సంపత్ గౌడ్, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, ప్యాక్స్ చైర్మన్లు నాగిశెట్టి రాజయ్య, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి,గంగుల రాంరెడ్డి,రొంటాల లక్ష్మారెడ్డి, పార్టీ నాయకులు రేమిడి శ్రీనివాస్ రెడ్డి,మగ్రి ఓదెలు యాదవ్,రామిడి తిరుమల్ రెడ్డి,మడుపు ప్రేమ్ కుమార్,నరేష్,రేవెల్లి రాజలింగం, ఇర్ఫాన్,కోండ్ర సురేష్, పెంచాల కిషన్ రావు,బుర్ర శ్రీధర్ గౌడ్,ఎడ్ల సత్యనారాయణ,రామడుగు హరీష్ ,గొల్లెన కనుకవ్వ,ఎడ్ల శ్రీధర్, గొల్లెన కొమురయ్య, కలవేని శ్రీనివాస్,ఎన్ బాపురావు, కే.చిరంజీవి,కనకం కుమార్, తమ్మిశెట్టి రాజేష్ పాల్గొన్నారు.



# తార్నాకలో ఏబీఆర్ఎస్ఎం కార్యాలయం ప్రారంభం

నాచారం (వాయిస్ టుడే): స్థానిక తార్నాకలో అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) నూతన కార్యాలయాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్ఎస్ఎస్ అఖిల భారతీయ ప్రచార ప్రముఖ్ శ్రీ సునీల్ అంబేద్కర్, కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ శ్రీ బట్టు సత్యనారాయణ, ఏబీఆర్ఎస్ఎం ఆలిండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీ మహేంద్ర కపూర్ పాల్గొన్నారు. ఏబీఆర్ఎస్ఎం ఆలిండియా జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీ గుంత లక్ష్మణ్, ప్రొఫెసర్ మురళీ మనోహర్‌తో పాటు పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, ఏబీవీపీ ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏబీఆర్ఎస్ఎం అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎన్. కిషన్, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఏలూరు యాదయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

**భారతీయ విద్యా పరిశోధన, ఉన్నతికి దోహదం**

భారతీయ విద్యా విధానం, పరిశోధన, విద్యా రంగ అభ్యున్నతికి మరింతగా కృషి చేయాలనే ఉద్దేశంతో కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా ఏబీఆర్ఎస్ఎం కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యాలయ ప్రారంభోత్సవం విజయవంతం కావడానికి కృషి చేసిన డాక్టర్ జగన్, డాక్టర్ రాజిరెడ్డి, డాక్టర్ సుజాత, డాక్టర్ స్వప్న, భాస్కర్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ సోమేశ్, కవిత, వివేక్, సుమన్, తిరుపతిరెడ్డి, డాక్టర్ ఉపేంద్ర, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ కవిత, డాక్టర్ చిత్తరంజన్, సంపత్, లోకేష్ తదితరులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు
VOICE OF PRAJALU
హైదరాబాద్
సోమవారం 24 ఆగస్టు 2026

# జీవో 97ను రద్దు చేయాల్సిందే.. లేదంటే పోరాటం తప్పదు!




## సామాజిక, ప్రజా చైతన్యం కోసం కళాకారుల కలాలు, గళాలు ఉండాలి

**కళాకారులు శిక్షణ ద్వారా కళా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి.**

**సిపిఐ సీనియర్ నేత,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి.**

కరీంనగర్,ఆగస్టు 23(వాయిస్ టుడే): సకల జనుల హితం కోసం,సామాజిక కోణంలో ప్రజలను చైతన్యవంతం చేయడం కోసం కళాకారులు తమ కళాలకు, గళాలకు పనిచెప్పాలని, కళాకారులు శిక్షణ ద్వారా తమ నైపుణ్యం పెంపొందించుకోవాలని సిపిఐ సీనియర్ నాయకులు,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు.కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో రెండు రోజుల పాటు జరిగే తెలంగాణ ప్రజానాట్య మండలి కళాకారుల శిక్షణ శిబిరంను చాడ వెంకట రెడ్డి ప్రారంభించారు.ఈ శిక్షణ శిబిరంకు హాజరైన కళాకారులను ఉద్దేశించి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ రచయితలు,కవులు,కళాకారులు కార్మిక,కర్షక,ప్రజా సమస్యలపై,వారి జీవనవిధానాలపై నిరంతరం అధ్యయనం చేస్తూ రచనలు, పాటలు,వీధి నాటకాలు వ్రాయాలని,కళాకారులు ఎంతో మంది ఉంటారు కానీ ప్రజా కళాకారులు కొంత మంది మాత్రమే ఉంటారని అలాంటి కళాకారులు నిత్యం ప్రజల బాధలను చూసి వాటిని ప్రపంచానికి తెలిజేసేందుకు పాటలు పాడాలని,కళ కాసుల కోసం కాదు ప్రజల కోసమని పాడే కళాకారులే ప్రజానాట్య మండలి కళాకారులని,అలాంటి కళాకారులు నిత్య విద్యార్థులుగా ఎన్నో విషయాలు తెలుసుకొని, పాటలు నేర్చుకొని పాడాలని అందుకు ఇలాంటి శిక్షణా శిబిరాలు ఉపయోగపడతాయని వెంకటరెడ్డి పేర్కొన్నారు.ప్రజల కష్ట,సుఖాలను పాటల రూపంలో బయటకు తెచ్చి ఎంతో మందిని మెప్పించే అత్యంత బలమైన ఆయుధం పాట అని,ఏ పోరాటాలు,ఉద్యమాలు,బహిరంగ సభలు విజయవంతం కావాలన్నా కళాకారులు ఉండాల్సిందేనని, కరీంనగర్ లో సెప్టెంబర్ 6వ తేదీ నుండి 8వ తేదీ వరకు జరిగే ఏఐటీయూసీ రాష్ట్ర 4వ మహాసభల విజయవంతం కోసం కళాకారులు తమ వంతుగా కళారూపాలు ప్రదర్శించాలని వెంకటరెడ్డి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ కరీంనగర్ , పెద్దపల్లి జిల్లాల కార్యదర్శులు పంజాల శ్రీనివాస్, తాంద్ర సదానందం,ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు కురుమిద్ద శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ,ఇప్టా జాతీయ కౌన్సిల్ సభ్యులు కవ్వంపల్లి స్వామి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి కటిక రెడ్డి బుచన్న యాదవ్,టేకుమల్ల సమ్మయ్య, ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు కన్నం లక్ష్మీనారాయణ,ఉప్పలయ్య,సహాయ కార్యదర్శి రేగుంట చంద్ర శేఖర్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గణేష్,వెంకటాచారి,రోంటాల శ్యామ్,ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు దుడ్డేల సమ్మయ్య, వరకోలు సదానందం, ఎజ్జ రాజయ్య,లక్ష్మీరాజం,ఆసాల రమ,ఇందిరా,లక్ష్మణ్,ఎర్రోజు శ్రీనివాస్,మోహన్,దప్పురాజు పాల్గొన్నారు.



## పొలిటికల్ అఫైర్స్ కమిటీ (PAC) సమావేశం

రాజన్న సిరిసిల్ల జిల్లా, 23 (వాయిస్ టుడే): గాంధీభవన్, హైదరాబాద్, లో.. ఏఐసీసీ సెక్రెటరీ, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్చార్జ్ సచిన్ సావంత్ సమక్షం లో రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ అధ్యక్షతన రాజన్న సిరిసిల్ల జిల్లా రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం గాంధీభవన్లో జరిగింది. ఈ సమావేశం లో గత పిఏసి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సమీక్షిస్తూ, ఈ సమావేశం లో జిల్లాలోని తాజా స్థానిక రాజకీయ పరిస్థితి, ప్రభుత్వం పై ప్రజల అభిప్రాయం, సర్ ౹ాంజుూజు 2, కార్యాచరణ ప్రణాళిక.. మండల, పట్టణ కమిటీల నిర్వహణ గూర్చి..దీ ా ూ 2 .. కార్యకలాపాల పర్యవేక్షణ... చర్చించి వచ్చే సమావేశం వరకు ఎజెండా తీర్మాలన్నీ చేయుటకు తీర్మానించనైనది. మిడ్ మానేరు ముంపు గ్రామాల సమస్యల పరిష్కారం గురించి అలాగే స్థానిక సమస్యల గురించి పరిష్కారం గూర్చి చర్చించడం జరిగింది... ఈ సమావేశం లో జిల్లా రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు, రాష్ట్ర వాక్ బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ , సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డి, కుస రవీందర్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆడపు చంద్రకళ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు గుగులోతు హరిలాల్ , జిల్లా ఎస్సీ విభాగ అధ్యక్షులు పండుగ ప్రదీప్, జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్ రియాజుద్దీన్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కోలగానీ వెంకటేష్ పాల్గొన్నారు.




## కరీంనగర్‌కు చేరుకున్న సమరసత సంకల్ప్ అభియాన్ పవిత్ర కలశం

కరీంనగర్,ఆగస్టు 23(వాయిస్ టుడే): సంత్ శిరోమణి శ్రీ గురు రవిదాస్ మహారాజ్ 650 వ జయంతి ఉత్సవాలు పురస్కరించుకొని సమరసత సంకల్ప్ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా సంత్ గురు రవిదాస్ మహారాజ్ జన్మస్థలమైన సీర్ గోవర్ధన్‌పూర్ నుండి తీసుకువచ్చిన పవిత్ర మట్టి కలశాన్ని హైదరాబాద్ నుండి కరీంనగర్‌కు బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం ఆధ్వర్యంలో తీసుకువచ్చారు.ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ సమరసత సంకల్ప్ అభియాన్ ప్రోగ్రాం నిర్వహణలో భాగంగా కలశ వందన్ అభియాన్ పేరిట పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగుతాయని వివరించారు.ఇందులో భాగంగా జిల్లా స్థాయి కలశ వందనం,స్థానిక ఆలయాల స్థాయిలో సమరసత కార్యక్రమాలు, సంత్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.సమాజంలో సమరసత భావనను పెంపొందించడం, సాధువులు, ఆలయ కమిటీలు,ప్రజా ప్రతినిధులు వివిధ వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకు వెళ్లడమే అభయాన్ ముఖ్య ఉద్దేశమన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్సీ మోర్చా అధ్యక్షులు బత్తుల లక్ష్మీనారాయణ,శేఖర్,రమేష్, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

### మాజీ మంత్రి గంగుల కమలాకర్




కరీంనగర్,ఆగస్టు 23(వాయిస్ టుడే): పాలిటెక్నిక్ విద్యను బలిపెట్టే కుట్రపై ప్రభుత్వ తీరును మాజీ మంత్రి,ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఎండగట్టారు.కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మాడల్ గురుకుల పాలిటెక్నిక్ మహిళా కళాశాలలో శుక్రవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది.ప్రభుత్వ తాజా నిర్ణయంతో తమ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్న విద్యార్థినులకు మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అండగా నిలిచారు. కళాశాలను సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించిన ఆయన,వారి గోడును సానుభూతితో ఆలకించి ధైర్యం చెప్పారు. జీవో నెంబర్ 97ను వెంటనే రద్దు చేసి, పూర్వపు పాలిటెక్నిక్ విద్యా విధానాన్ని కొనసాగించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని తీవ్రంగా డిమాండ్ చేశారు. కళాశాలకు విచ్చేసిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఎదుట విద్యార్థినులు తమ గోడును వెళ్లబోసుకుంటూ కన్నీటి పర్యమయ్యారు.పాలిటెక్నిక్ విద్యా విధానాన్ని మార్చివేస్తే భవిష్యత్తులో తాము ఎంతో ఆశపడే 'ఈ-సెట్' రాసే అవకాశం కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విధానం వల్ల పేద,మధ్యతరగతి విద్యార్థులకు ఇంజనీరింగ్ చదువులు పూర్తిగా దూరమవుతాయని వాపోయారు. ముఖ్యంగా ప్రస్తుతం మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు రాబోయే రోజుల్లో ఏలాంటి అవకాశాలు ఉంటాయో, పరీక్షలు ఎలా ఉంటాయో అర్థం కాక దిక్కుతోచని స్థితిలో ఉన్నామని తమ ఆందోళనను వెల్లడించారు.విద్యార్థుల ముఖాల్లోని ఆందోళనను గమనించిన గంగుల వారికి అభయమిస్తూ,మీ భవిష్యత్తు కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని భరోసా నిచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల కారణంగానే జీవో నెంబర్ 97 పుట్టుకొచ్చిందని దుయ్యబట్టారు. తాను స్వయంగా ఇంజనీరింగ్ విద్యనభ్యసించిన విషయాన్ని గుర్తుచేస్తూ పాలిటెక్నిక్ పూర్తి చేసి నేరుగా ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులు కళాశాలల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తారని,సాంకేతిక పరిజ్ఞానంలో ఇతరులకన్నా ముందంజలో ఉంటారని స్పష్టం చేశారు.సాంకేతిక విద్యా విధానాన్ని పక్కనపెట్టి పీవీవీ మోడల్ పేరుతో కొత్త విధానాన్ని తెరపైకి తెచ్చి, పాలిటెక్నిక్ విద్యను పూర్తిగా ప్రైవేటీకరణ చేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. దీనిద్వారా పేద విద్యార్థులకు సాంకేతిక విద్యను దూరం చేసి,కార్పొరేట్ శక్తులకు పట్టం కట్టాలని చూస్తున్నారని విమర్శించారు. పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేయడం ద్వారా ఆయా కళాశాలలకు చెందిన కోట్ల విలువైన విలువైన ప్రభుత్వ భూములను అదాని, అంబానీ లాంటి బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నంలో భాగంగానే ప్రభుత్వం ఈ జీవోను ప్రకటించిందని గంగుల కమలాకర్ సంచలన ఆరోపణలు చేశారు. పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయాలని చూస్తే,విద్యార్థుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తగ్గిందని గుర్తుచేశారు.అదే బాటలో తెలంగాణ ప్రభుత్వం కూడా స్పందించి,విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జీవో నెంబర్ 97ను బేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.జీవో నెంబర్ 97 రద్దయ్యే వరకు విద్యార్థుల పక్షాన నిలిచి ఏ క్షణంలోనైనా పోరాటం చేస్తాము.అసెంబ్లీ సమావేశాల్లో ఈఅంశాన్ని ప్రముఖంగా లేవనెత్తి ప్రభుత్వాన్ని నిలదీస్తాం.పేద విద్యార్థుల నోటికాడి బుగ్గిని లాక్కునే ఈ దుర్మార్గపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు విశ్రమించే ప్రసక్తే లేదు.ఈ కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి జీవో నెంబర్ 97ను రద్దు చేయాలంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు.ఈ పోరాటంలో విద్యార్థులకు అండగా ఉండి న్యాయం జరిగే వరకు వారి పక్షాన గొంతుక వినిపిస్తానని గంగుల కమలాకర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ గ్రంధాలయ సంస్థ చైర్మెన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, శాతవాహన యూనివర్సిటీ బీఆర్ఎస్వి ఇంచార్జ్ చుక్క శ్రీనివాస్,నాయకులు గంగాధర చందు మొగిలోజు వెంకట్, బిఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

## తనకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలను సందర్శించిన ఎంపీ వద్దిరాజు



ఇనుగుర్తి, ఆగస్టు 23 (వాయిస్ టుడే): బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన స్వగ్రామమైన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో తాను విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలను ఆదివారం సందర్శించారు. తాను చదువుకున్న ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు శిథిలావస్థకు చేరుకోవడాన్ని చూసి చలించిన ఎంపీ రవిచంద్ర వాటి స్థానంలో నూతన భవనాలను నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకోసం తన కుటుంబం తరఫున రూ.1 కోటి అందించడంతో పాటు, చమురు సంస్థల నుంచి మరో రూ.6 కోట్లను మంజూరు చేయించారు. మొత్తం రూ.7 కోట్ల వ్యయంతో పాఠశాలలకు నూతన భవనాలను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలు ఉన్న ప్రదేశంలోనే కొత్త భవనాల నిర్మాణానికి జూన్ 26న భూమిపూజ నిర్వహించారు. నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించేందుకు ఆదివారం ఎంపీ రవిచంద్ర తన పెద్దన్న వద్దిరాజు కిషన్, గ్రామ ప్రముఖులతో కలిసి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీ సంబంధిత వారికి పలు సూచనలు, సలహాలు అందించారు. పనులను మరింత వేగవంతం చేసి, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత సమయంలో భవనాల నిర్మాణం పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రవిచంద్ర వెంట సన్నిహితులు వేం రాంచంద్రారెడ్డి, సర్పంచ్ తమటపల్లి కుమార్, సింగిల్ విండో చైర్మన్ ధీకొండ వెంకన్న గౌడ్, ఉప సర్పంచ్ సత్తూరి యాదగిరి, దిశ కమిటీ సభ్యుడు గుజ్జునూరి బాబూరావు, గోపనదాసు కృష్ణ, గుజ్జునూరి వెంకన్న, కొలిపాక నారాయణ, తమటపల్లి యాదగిరి తదితరులు ఉన్నారు.



## తలసేమియా బాధితురాలు మౌనితను పరామర్శించిన ఎంపీ వద్దిరాజు

ఇనుగుర్తి, ఆగస్టు 23 (వాయిస్ టుడే): బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆదివారం తన స్వగ్రామమైన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన తలసేమియాతో బాధపడుతున్న చిన్నారి మౌనితను పరామర్శించి, ఆమె కుటుంబానికి భరోసా కల్పించారు. ముందుగా తన మనుమరాలు తారుణి డోలాహరణ మహోత్సవంలో పాల్గొన్న ఎంపీ రవిచంద్ర చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం ఇనుగుర్తి గ్రామ పంచాయతీలో డ్రైవర్‌గా పనిచేస్తున్న గుజ్జునూరి ప్రసాద్, సంతోష దంపతుల ఆరేళ్ల కుమార్తె మౌనితను పరామర్శించారు. మౌనిత ఇనుగుర్తిలోని వాగ్దేవి పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. కొంతకాలంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎంపీ చిన్నారి ఆరోగ్య పరిస్థితిని, కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మౌనితకు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తానని తల్లిదండ్రులు ప్రసాద్, సంతోషలకు ఎంపీ రవిచంద్ర హామీ ఇచ్చారు. చిన్నారి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తమ కుమార్తెకు మెరుగైన చికిత్స అందించేందుకు ముందుకు వచ్చిన ఎంపీ రవిచంద్రకు మౌనిత తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇనుగుర్తిలో ఘనంగా ఎంపీ వద్దిరాజు మనుమరాలి డోలాహరణ మహోత్సవం

ఇనుగుర్తి, ఆగస్టు 23 (వాయిస్ టుడే): బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మనుమరాలు తారుణి డోలాహరణ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఎంపీ రవిచంద్ర స్వగ్రామమైన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలోని కాకతీయుల కాలం నాటి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఈ వేడుకను కుటుంబ సభ్యులు, గ్రామ ప్రముఖుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. వద్దిరాజు రవిచంద్ర--విజయలక్ష్మి దంపతుల కుమారుడు నిఖిల్ చంద్ర, కోడలు అనీల దంపతుల చిన్న కుమార్తె తారుణి డోలాహరణ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్ఛరణలు, ఆశీర్వచనాల మధ్య సంప్రదాయబద్ధంగా జరిగింది. కుటుంబ సభ్యులు చిన్నారిని ఆశీర్వదించి, ఆమె ఆయురారోగ్యాలతో సంతోషంగా ఎదగాలని ఆకాంక్షించారు.

ఈ వేడుకకు తాతలు, నాయనమ్మలు వద్దిరాజు కిషన్--శశిరేఖ, వద్దిరాజు దేవేందర్--ఇందిర, వద్దిరాజు మోహన్--వాసవి, వద్దిరాజు వెంకటేశ్వర్లు--పద్మ, వద్దిరాజు వెంకటేశ్వర్లు--ఉమా మహేశ్వరి, తాత శీలంశెట్టి సత్యనారాయణ, అమ్మమ్మ రేవతి పద్మ, తాత--అమ్మమ్మ సంగిశెట్టి రాంమూర్తి--పద్మ తదితరులు హాజరయ్యారు. అలాగే మేనత్తలు జే. సునీత, డాక్టర్ గంగుల గంగాభవాని, పెదనాన్నలు వద్దిరాజు శ్రీనివాస్, వద్దిరాజు ధీరజ్, బాబాయిలు వద్దిరాజు అఖిల్, వద్దిరాజు గిరినందన్, మేనత్త భర్త విజయ్, అక్క వద్దిరాజు సహస్రిక తదితర కుటుంబ సభ్యులు పాల్గొని చిన్నారి తారుణిని ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ ప్రముఖుల సమక్షంలో జరిగిన ఈ డోలాహరణ మహోత్సవం ఆహ్లాదకరమైన వాతావరణంలో ఘనంగా ముగిసింది.





Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**